RNI No : APTEL 2020/80757

www.sreeprasthanam.in

# శ్రీ ప్రస్థానం

మన దేశం..మన హక్కు

తెలుగు దినపత్రిక

కర్నూలు సంపుటి : 04 సంచిక :117 గురువారం 05-09-2024 పేజీలు :04 వెల:రూ.2.00

## ప్రాజెక్టుల పేర్లు కొనసాగించాలి

నెల్లూరు మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్ రెడ్డి జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్నారు. మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి, వైసీపీ జిల్లా అధ్యక్షులు ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి, జడ్పీ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ పాల్గొన్నారు.మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్ రెడ్డి మాట్లాడుతూ వరద బాధితులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం మీదుంది. జగన్ కోరిక గౌతమ్ రెడ్డి ఆత్మకూరు అసెంబ్లీ నుంచి పోటీ చేశారు.. తర్వాత మంత్రిగా చేసి మంచి పేరు తెచ్చుకున్నారు. సంగం బ్యారేజ్ కి మేకపాటి గౌతమ్ రెడ్డి అని పేరు పెడితే.. దాన్ని తొలగించడం దారుణం. నెల్లూరు బ్యారేజ్ కి నిజాయతీపరుడుగా ఉన్న నల్లపురెడ్డి శ్రీనివాసులు రెడ్డి పేరు పెడితే దాన్ని సైతం తీసేయ్యడం దుర్మార్గం. అధికారం శాశ్వతం కాదనే విషయాన్నీ చంద్రబాబు గుర్తు పెట్టుకోవాలి.. ఇచ్చిన ఒక్క హామీని కూడా అమలు చెయ్యకపోవడం చంద్రబాబు ట్రాక్ రికార్డు. రాజశేఖరరెడ్డి చెప్పినవి.. చెప్పానవి కూడా చేసారు.. అయన బతికి ఉంటే మూడుసార్లు సీఎం అయ్యేవారు.. రాష్టం విడిపోయేది కాదు.

### విలేఖరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల వ్యాప్తంగా " శ్రీ ప్రస్థానం దినపత్రికలో " పనిచేయుటకు జిల్లా స్టాఫర్లు, సిసి ఇంచార్జులు, మండల స్థాయి పాత్రికేయులు కావలెను. సమాజంలో జరిగే ప్రతి విషయాన్ని ప్రజల ముంగిటకు తీసుకెళ్లాలనే ఆసక్తి, అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుంది.

పెరుమాళ్ళ వర ప్రసాద్

సంప్రదించవలసిన నంబర్లు

94916 28386 85220 22029

Land Line No : 08517 224194

# యుద్ధప్రాతిపదికన సహాయ పునరావాసం




నిరంతరంగా శ్రమిస్తున్న పారిశుధ్య సిబ్బంది
స్పీడుగా బురద తొలగింపు...వీధుల శుభ్రం చేసే పని
పనుల కోసం 2,100 మంది పారిశుద్ధ్య సిబ్బంది ఏర్పాటు
వ్యాధులు ప్రబలకుండా 62 మెడికల్ క్యాంపులు ఏర్పాటు
179 మంది సీనియర్ అధికారులకు ఇన్‌ఛార్జులుగా బాధ్యతలు
బాధితులకు నిరంతరాయంగా ఆహారం, నీటి సరఫరా
వైకాపా బురద రాజకీయాలపై ఆగ్రహం
వరద ప్రాంతాల్లో పర్యటించాలని అమిత్‌షాకు వినతి
మీడియా సమావేశంలో సిఎం చంద్రబాబు వెల్లడి

విజయవాడ,సెప్టెంబర్4(: వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయ చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయని సీఎం చంద్రబాబు తెలిపారు. సిబ్బంది నిరంతరాయంగా పనిచేస్తున్నారని, అధికారులు కూడా అక్కడే ఉండి పర్యవేక్షస్తున్నారని అన్నారు.విజయవాడలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎక్కడ ఎలాంటి అవసరమొచ్చినా తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. బురద తొలగింపు పనులు ప్రారంభమయ్యాయని చెప్పారు. 62 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 2,100 మంది పారిశుద్ధ్య సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వందకుపైగా ఫైరిరజన్లు సహాయక చర్యలో పాల్గొన్నాయని, పొక్లెయిన్లు, టిప్పర్ల ద్వారా వేస్టేజ్‌ను తరలిస్తున్నామని తెలిపారు. సహాయచర్యల్లో 32 మంది ఐఏఎస్‌లు పనిచేస్తున్నారు. 179 సచివాలయాలకు 179 సీనియర్ అధికారులకు ఇన్‌ఛార్జులుగా పెట్టాం. ఎవరైనా చనిపోతే మృతదేహాలను బంధువులకు అప్పగిస్తున్నాం. మృతుల కుటుంబాలకు రూ.5లక్షల పరిహారం అందించాలని ఆదేశాలిచ్చాం. మంగళవారం 9,09,191 ఆహార ప్యాకెట్లు పంపిణీ చేశాం. బుధవారం ఇప్పటి వరకు 6లక్షల ఆహార ప్యాకెట్లు పంపిణీ చేశాం. 8.50లక్షల వాటర్ బాటిళ్లు, 3లక్షల లీటర్ల పాలు, 5లక్షల బిస్కెట్ ప్యాకెట్లు అందించాం. 5లక్షల మందికి భోజన ఏర్పాట్లు చేశాం. గర్భిణిలకు ప్రత్యేక వైద్యం అందించాలని ఆదేశాలిచ్చామని వివరించారు. విజయవాడకు బుడమేరు ప్రధాన సమస్యగా తయారైందన్నారు. ప్రధానంగా ఆక్రమణల కారణంగా అది పంజా విసిరిందన్నారు. చిన్న చిన్న వాగులన్నీ కలిసి బుడమేరు పెద్దదిగా మారింది. అటు కృష్ణానది, ఇటు బుడమేరు కలిసి విజయవాడను ముంచెత్తాయి. బుడమేరును గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ఐదేళ్లపాటు ఏం చేశారని వైకాపా నేతల్ని ప్రశ్నిస్తున్నాం. వాగులను కబ్జా చేయడమే ఈ దుస్థితికి కారణం. ఆఖరికి పోలవరం కాలువలోనూ మట్టిని తవ్వేశారు. బుడమేరు నీరు కొల్లేరు, కృష్ణానదికి వెళ్లేలా చర్యలు తీసుకుంటాం. బుడమేరు ప్రవాహ దారిలో కాలువలు, వాగుల్లో కబ్జాలు తొలగిస్తాం. ఇలాంటి విపత్తులను అందరూ సమష్టిగా ఎదుర్కోవాలి. వరద బాధితులు అందరికీ న్యాయం చేస్తాం. రేపు ఉదయానికి వరద పూర్తిగా తగ్గిపోతుందని చంద్రబాబు తెలిపారు.

# విలవిలలాడుతున్న బెజవాడ



విజయవాడ, సెప్టెంబర్ 4 కనీ, వినీ ఎరుగని వరదలివి. ఒక్కసారిగా కృష్ణమ్మ ఉప్పొంగిపోయింది. కృష్ణా నదిలో సంగమించే మున్నేరు.. బుడమేరు ఉగ్రరూపం దాల్చాయి. కుండపోత వానలతో వాన నీరు వరదనీరుగా మారి ఊళ్లను.. విజయవాడ నగరంలోని పలు కాలనీలను ముంచెత్తింది. గత రెండు దశాబ్దాల్లో రాష్ట్రాన్ని అతలాకుతలం చేసిన అతి పెద్ద వరదల్లో ఇప్పుడు విజయవాడ వరద కూడా వచ్చి చేరింది. విజయవాడ నగరంలో 40% పైగా ప్రాంతము వరద ముంపునకు గురయింది. నగరం చుట్టూ ఉన్న రెండు నదులు, కృష్ణా ? బుడమేరు ఒడ్డు దాటి నగరాన్ని ముంచెత్తాయి. విజయవాడలో ఎప్పుడూ వరద అంటే తెలియని చాలా ప్రాంతాలు కూడా ఈసారి వరదల్లో మునిగిపోయాయి అంటే వరద తీవ్రత అర్థం చేసుకోవచ్చు. ఈ వరదలు ఎన్టీఆర్ జిల్లాలో 2.76 లక్షల మంది ప్రజలను ప్రభావితం చేశాయి. మనిషి ప్రకృతి ముందు ఎంత అల్పుడో మొన్న కేరళలోని వయనాడ్ బీభత్సం తెలియజేస్తే లేటెస్ట్‌గా బెజవాడ వరదలు మరోసారి కన్నెర్రశాయి. ముఖ్యంగా విజయవాడ సిటీ మధ్యలో ప్రవహించే బుడమేరు అనే చిన్న నది నాలుగు జిల్లాల ప్రజలను బెంబేలెత్తిస్తోంది. విజయవాడ సిటీ అయితే రెండు రోజులుగా నిద్ర పోవడం లేదు. సగానికిపైనే నగరం మొత్తం నీటిలో మునిగిపోయింది. విజయవాడ శివారు గ్రామాలు, ఏరియాలు పూర్తిగా బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. సింగ్‌నగర్, రామకృష్ణాపురం, నందమూరినగర్, నున్న, విజయవాడ వన్‌టౌన్, కృష్ణలంక, ఇబ్రహీంపట్నంలలో ఇళ్ళలోకి నీరు చేరిపోయింది. రామవరప్పాడు రైల్వే స్టేషన్ అయితే మొత్తానికి నీట మునిగింది. బుడమేరు వాగు తన విశ్వ రూపాన్ని చూపిస్తోంది. దాని కట్ట తెగిపోవడంతో విజయవాడను ముంచెత్తింది. చాలామంది ప్రజలు మునిగిపోయిన ఇళ్ళలోనే ఇంకా చిక్కుకు పోయారు. వారిని కాపాడటానికి కేంద్రం నుంచి ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, స్పీడ్ బోట్లు, హెలికాప్టర్లు ప్రత్యేకంగా విజయవాడ చేరుకున్నాయి.బుడమేరు అనేది మైలవరం కొండల్లో పుట్టిన ఒక పెద్ద వాగు. అయితే చరిత్రలో చాలా ఏళ్ళ నుంచి దానిని నదిగానే పరిగణిస్తూ అంటారు. ఏడాది పొడువునా ఏదో ఒక స్థాయిలో దీన్లో నీళ్ళు ఉంటాయి. కృష్ణా, గోదావరి పరివాహక ప్రాంతాల మధ్య విస్తరించి ఉన్న అతిపెద్ద మంచినీటి సరస్సు కొల్లేరుకు నీటిని సప్లయి చేసే అతి ముఖ్యమైన వాగుల్లో పుట్టిన ప్రాంతం నుంచి దాదాపు 170ని.ఎ దూరం ప్రవహించే బుడమేరులో ఏటా 10 వేల నుంచి 11 వేల క్యూసెక్కుల వరకు నీరు ప్రవహిస్తూ ఉంటుంది. అయితే 2005 ప్రాంతంలో వచ్చిన వర్షాలకు బుడమేరులో ఏకంగా 75 వేల క్యూసెక్కుల నీరు ప్రవహించింది అని చెబుతారు. అప్పుడే విజయవాడ చాలా వరకూ దెబ్బతింది. ఆ తరువాత 2009లో మరోసారి అలాంటి పరిస్థితే ఎదురైంది. బుడమేరు వాగు తన ప్రయాణంలో చాలా మలుపులు మెలికలు తిరుగుతూ ఉంటుంది. దానివల్ల ఎక్కువ ప్రవాహం వచ్చినపుడు అది గట్టు దాటి చుట్టూ ఉన్న ప్రాంతాలకు చేరిపోతూ ఉండేది. అందుకే ఈ నదికి బెజవాడ దుఃఖ:దాయని అని పేరు పడింది.

## వరద బాధితులకు ఏపీ ఎన్జీవో రూ. 120 కోట్ల భారీ విరాళం

అమరావతి : ఏపీలో వరద బాధితులను ఆదుకునేందుకు ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలు భారీ విరాళాన్ని ప్రకటించారు. ఉద్యోగుల సెప్టెంబర్ నెల జీతంలో ఒక రోజు బేసిక్ పే ద్వారా రూ. 120 కోట్లు సీఎం సహాయనిధికి విరాళం ఇస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగులు , ఉపాధ్యాయులు పింఛన్ల నుంచి ఈ విరాళం అందజేస్తామని జేఏసీ నాయకులు కె.వి.శివారెడ్డి, విద్యాసాగర్ సీఎం చంద్రబాబుకు అంగీకార పత్రం



అందజేశారు.వరద బాధితుల కోసం ఏపీ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రూ. 25 లక్షలు అందజేసింది. ఉమ్మడి తెలంగాణ రాష్ట్రాల్లో భారీ వర్షాల కారణంగా నష్టపోయిన బాధితులకు ఏపీ డిప్యూటీ సీఎం, నటుడు పవన్ కల్యాణభారీ విరాళాన్ని ప్రకటించారు. సుమారు రూ. 6 కోట్లను ప్రకటించారు. ఏపీలోని 400 గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య నిర్వహణకు తనవంతుగా లక్ష రూపాయల చొప్పున రూ. 4 కోట్లు అందజేస్తానని ప్రకటించారు. ఏపీకి, తెలంగాణకు రూ. కోటి చొప్పున సీఎం సహాయనిధికి పంపిస్తానని తెలిపారు. హెరిటేజ్ ఫుడ్ అధినేత నారా భువనేశ్వరి రెండు తెలురు రాష్ట్రాలకు రూ. కోటి చొప్పున ప్రకటించారు.

## హైడ్రా తరహాలో బుడమేరు ఆక్రమణలు తొలగించాలి

విజయవాడ ముంపు జాతీయ విపత్తుగా గుర్తించాలి
కేంద్రాన్ని కోరిన పిసిసి చీఫ్ షర్మిల

విజయవాడ,సెప్టెంబర్4: విజయవాడ ముంపును జాతీయ విపత్తుగా ప్రకటించాలని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. బుడమేరు రక్షణకు వెంటనే చర్యలు ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణలో హైడ్రా మాదిరి.. బుడమేరు ఆక్రమణలు తొలగించాలని సూచించారు. గురువారం సింగ్‌నగర్ ప్రాంతంలో పర్యటించిన ఆమె.. వరద బాధితులను పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధితులను పూర్తిస్థాయిలో ఆదుకోవాలని కోరారు. వరద ప్రాంతాల్లో సీఎం చంద్రబాబు పర్యటించి ప్రజలకు ధైర్యం చెప్పడం మంచి విషయమన్నారు. 'కొంప కొల్లేరు అయ్యింది.. బెజవాడ బుడమేరు అయింది. విజయవాడ వరదలకు బుడమేరే కారణం. వరద నీరు కొల్లేరుకు చేరేలా చర్యలు చేపట్టాలి. ఈ ప్రమాదం రాకుండా చూడాల్సిన భాధ్యత ప్రస్తుతం చంద్రబాబు మీదే ఉంది. బుడమేరుకి రిటర్నింగ్ వాల్ కట్టాలి. వరదల్లో ఇప్పటి వరకు 35 మంది చనిపోయారు. 5లక్షల మంది నష్టపోయారు. ఇది ఘోర విపత్తు. ఇంత పెద్ద విపత్తు సంభవిస్తే ప్రధాని మోదీ కనీసం స్పందించలేదని మండిపడ్డారు. విజయవాడ వరదలు కేంద్రానికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఇక్కడి ఎంపీల మద్దతుతో ప్రధాని అయ్యాననే సంగతి మరిచారు. ఏపీ ప్రజల కష్టాలు మోదీకి కనిపించడంలేదు. వెంటనే స్పందించి జాతీయ విపత్తుగా ప్రకటించాలి.

# బుడమేరు ఆక్రమణలే కొంప ముంచాయి




బురద జల్లే కార్యక్రమం మానండి
వీలైతే సహాయ కార్యక్రమాల్లో పాల్గొనండి
వైకాపా కార్యకర్తలు సమాయచర్యల్లో దిగాలి
విపత్తుల సమయంలో చంద్రబాబు అనుభవం పనికొస్తోంది
ఆయనలా కష్టపడడం ఎవరికీ సాధ్యం కాదు
పంచాయితీరాజ్ ద్వారా గ్రామాలకు 4కోట్ల సాయం
వరదసహాయకచర్యలకు అంతరాయమనే తాను వెళ్లడంలేదు
తెలంగాణకు కోటి సాయం ప్రకటించిన డిప్యూటి సిఎం పవన్

అమరావతి,సెప్టెంబర్4): విపత్తు సమయంలో సహాయక చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. సిఎంగా చంద్రబాబు అనుభవం ఏంటో ఇప్పుడు తెలుస్తున్నదని అన్నారు. వైకాపా విమర్శలు ప్రస్తావిస్తూ..రాళ్లు వేయడం సులువని, పనిచేసేవారికి ఎంత కష్టపడుతున్నారో తెలుస్తుందని అన్నారు. అమరావతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బుడమేరులోని 90 శాతం ఆక్రమణలే విజయవాడకు శాపంగా మారాయని పవన్ అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సీఎం చంద్రబాబు సమర్థంగా పనిచేస్తున్నారని కొనియాడారు. ఈ వయసులోనూ జేసీబీలు, ట్రాక్టర్లు ఎక్కి వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్నారన్నారు. ఆయన్ను అభినందించాల్సింది పోయి విమర్శలు చేయడం సరికాదని వైకాపా నేతలను ఉద్దేశించి హితవు పలికారు. వైకాపా నేతలు ముందు సహాయ కార్యక్రమాల్లో పాల్గొనాలని.. ఆ తర్వాతే ఆరోపణలు చేయాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతాలకు వెళ్లడం లేదంటూ వైకాపా నేతలు చేస్తున్న విమర్శలపై పవన్ స్పందించారు. తాను వెళ్తే సహాయక చర్యలకు ఇబ్బంది కలుగుతుందన్నారు. అధికార యంత్రాంగానికి ఒత్తిడి ఉంటుందని చెప్పడంతో తాను వెళ్లలేదని చెప్పారు. ఇంకా విమర్శించాలనుకుంటే వైకాపా నేతలు నాతో పాటు ఎక్కడికైనా రావొచ్చు. నా కాన్వాయ్‌లోనే తీసుకెళ్తాను. నాతో నడవండి.. ఎలా ఉంటుందో చూడండి. అప్పుడు మీరే సలహా ఇస్తారు. ఇది రాష్ట్ర సమస్య. వైకాపా నేతలు సహాయం చేసి మాట్లాడాలి. ఇళ్లలో కూర్చొని విమర్శలు చేస్తే సరిపోదని పవన్ వ్యాఖ్యానించారు. సహాయ కార్యక్రమాల్లో పంచాయతీరాజ్ శాఖ సిబ్బంది పాల్గొంటున్నారని పవన్ తెలిపారు. 175 బృందాలు విజయవాడ అర్బన్‌లో పనిచేస్తున్నాయని అన్నారు. వరద ప్రభావం లేని జిల్లాల నుంచి వచ్చిన 900 మంది పారిశుద్ధ్య కార్మికులు ఈ కార్యక్రమాల్లో పాల్గొంటున్నట్లు వివరించారు. వరదలకు ఎక్కువగా ఎన్టీఆర్ జిల్లా దెబ్బతిందని తెలిపారు. 26 ఎన్డీఆర్ఎఫ్, 24 ఎస్డీఆర్ఎఫ్ బృందాలు పనిచేస్తున్నాయని తెలిపారు. నేవీ నుంచి 2, ఎయిర్‌ఫోర్స్ నుంచి 4 హెలికాప్టర్ల ద్వారా ఆహార పంపిణీ జరుగుతోందని చెప్పారు.ఇదిలావుంటే బాధితులను ఆదుకోవడమంటే మాటలు చెప్పడం కాదని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నిరూపించారు. ఏకంగా రూ.4 కోట్ల వరద సాయాన్ని ఆయన ప్రకటించారు. వరద ప్రభావిత గ్రామాలకు ఆయన ఈ విరాళం అందించారు. మొత్తం 400 గ్రామ పంచాయతీలు వరద ముంపు బారిన పడ్డాయని, ఒక్కో పంచాయతీకి ఒక లక్ష రూపాయల చొప్పున నేరుగా పంచాయతీ ఖాతాకు విరాళం పంపిస్తానని ప్రకటించారు. రూ.4 కోట్లు మొత్తాన్ని ముంపు గ్రామ పంచాయతీలకు అందించాలని నిర్ణయించుకున్నట్టు ఆయన తెలిపారు. ఇక తెలంగాణ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ. కోటి విరాళం అందించనున్నట్టు పవన్ కల్యాణ్ వెల్లడించారు. ఈ మేరకు పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ వరద పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు.

# వరదబాధితులను ఆదుకోవడంలో విఫలం

ముఖ్యమంత్రిగా చంద్రబాబు అనర్హుడు
నీటమునిగిన పలు కాలనీల్లో జగన్ పర్యటన

విజయవాడ,సెప్టెంబర్4: వరద బాధితులను ఆదుకోవడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఫెయిల్ అయ్యారని మాజీ సీఎం జగన్ విమర్శించారు. బాధితులను ఆదుకునేందుకు ఏమీ చేయడం లేదని అన్నారు. ఎక్కడా రిలీఫ్ క్యాంపులు లేవని, నిరాశ్రయులైన వారిని తరలించడం కూడా జరగడం లేదని అన్నారు. ముఖ్యమంత్రి పదవిలో ఉండడానికి చంద్రబాబు అనర్హుడని అన్నారు. అధికారంలోకి వచ్చి 4 నెలలు అవుతున్నప్పటికీ.. అధికారులు అందరికీ తనకు నచ్చినట్లుగా పోస్టింగ్‌లు ఇచ్చుకున్నారని అన్నారు. అలాంటి అధికారులు తప్పు చేసేలా చంద్రబాబు ఎలా వ్యవహరించారని జగన్ ప్రశ్నించారు. విజయవాడ లోని న్యూ రాజరాజేశ్వరి పేటలో నీట మునిగిన కాలనీల్లో వైఎస్ జగన్ పర్యటించారు. అక్కడ వరద బాధితులతో మాట్లాడారు. ఆ తర్వాత మీడియాతో మాట్లాడారు. ఇది పూర్తిగా మ్యాన్ మేడ్ ఫ్లడ్స్ అని జగన్ మరోసారి పునరుద్ఘాటించారు. క్రిష్ణా నది కరకట్ట మీద ఉన్న చంద్రబాబు ఇంటిని ముంపు నుంచి



కాపాడేందుకే క్రిష్ణాలోని నీటిని బుడమేరులోకి గేట్లు ఎత్తి వదిలారని జగన్ మరోసారి చెప్పారు. దాని వల్లనే బుడమేరు నుంచి వరద విజయ వాడను ముంచెత్తిందని అన్నారు. గురువారమే వరద రాబోతోందని తెలిసినప్పుడు.. డ్యామ్ మేనేజ్‌మెంట్ ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. అసలు ప్రణాళికబద్ధంగా వ్యవహరించి ఉంటే పరిస్థితి ఇలా ఉండేది కాదని జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. రాజ రాజేశ్వరి పేట వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన ఆయన.. బాధితులను పరామర్శించారు. అనంతరం.. చంద్రబాబు సర్కార్ అలసత్వంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాలు, వరదల గురించి ముందస్తు సమాచారం ఉంది. అయినా కాస్తో కూస్తో ఆదుకునే ప్రయత్నమూ చేయలేదు. ఎక్కడా రిలీఫ్ క్యాంప్‌లు లేవు. ప్రజలపై చంద్రబాబుకు కనికరం లేదు. విజయవాడలో ఏ కాలనీకి వెళ్లినా.. ఇదే పరిస్థితి కనిపిస్తోంది.

# సంపాదకీయం

గురువారం 05-09-2024

## అపరాజిత సరే... శిక్షలు ఎక్కడ

దేశంలో మహిళలపై జరిగిన దారుణ అత్యాచారాల కేసుల్లో 30 శాతం కేసుల్లోనే నిందితులకు శిక్షలు పడుతున్నాయంటే మన నేర ప్రాసిక్యూషన్ వ్యవస్థ ఏ విధంగా ఉందో ఈ గణాంకాలే తె లియజేస్తున్నాయి. అత్యాచారాలు చేసిన 72 శాతం నిందితులు నేర వ్యవస్థలో డొల్లతనాన్ని అసరాగా చేసుకొని నిర్ధోషులుగా బయటపడు తున్నారు. కోల్‌కతా రేప్ కేసును చేపట్టడంలో మొదటి నుంచి జరిగిన తప్పులు ఆ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర ఆందోళనలకు దారి తీస్తోంది. కోల్‌కతా నగరం రోడ్లన్నీ విద్యార్థుల ఆందోళనలతో, పోలీస్‌ల ప్రతిఘటన చర్యలతో రణరంగంగా దద్దరిల్లింది. దీనికి కారణం దర్యాప్తులో జరిగిన తప్పు లు, వ్యవస్థలోని లోపాలు చివరకు మమతాబెనర్జీ రాజీనామా చేయాలన్న డిమాండ్‌కు దారి తీస్తున్నాయి. అత్యాచారం, హత్య కేసుల్లో నిందితులకు మరణ శిక్ష విధించేలా రూపొందించిన బిల్లును పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఆమోదించింది. అపరాజిత మహిళ, శిశు(పశ్చిమబెంగాల్ క్రిమినల్ చట్టాల సవరణ) పేరుతో ప్రవేశపెట్టిన ఈ బిల్లును సభ మూజువాణి ఓటుతో ఆమోదించగా.. ముందుగా హామీ ఇచ్చినట్లు బీజేపీ సభ్యులు ఓటింగ్ కోసం పట్టుబట్టలేదు. కేంద్ర చట్టాలు-- భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎ?స), భారతీయ నాగరిక్ సురక్ష సంహిత(బీఎన్ఎ?సఎ?స), చిన్నారులపై అత్యాచారాల నిరోధక చట్టం(పోక్సో)లో తగు సవరణలు చేయాల్సిందిగా ఈ బిల్లు సూచిస్తోంది. ముఖ్యంగా.. హత్యాచారాలు, అత్యాచారాలతో బాధితురాలి మానసిక స్థితి దెబ్బతినేలా చేసే నిందితులకు మరణ శిక్ష విధించాలని అపరాజిత బిల్లు స్పష్టం చేస్తోంది. ఈ నేపథ్యంలో బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం తప్పనిసరి. కాగా, సభలో బిల్లుపై జరిగిన చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి మమతాబెనర్జీ బీజేపీ నేతలపై విరుచుకుపడ్డారు. "మా ప్రభుత్వం తీసుకువచ్చిన బిల్లు తరహాలో.. ప్రధాని మోదీ చట్టాన్ని తీసుకురాకపోవడం సిగ్గుపడాల్సిన అంశం. ఈ బిల్లును హుందాగా ఆమోదించాల్సిందిగా గవర్నర్‌ను కోరుతున్నాను. సభలో విపక్ష నేత(బీజేపీ) కూడా గవర్నర్ ఈ బిల్లును పెండింగ్‌లో పెట్టకుండా, వీలైనంత త్వరగా ఆమోదించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాను" అని ఆమె వ్యాఖ్యానించారు. ఆర్‌జీ కర్ ఘటనలో సీబీఐ న్యాయం చేయాలని ఆమె కోరారు. ఏటా 30,000 కు పైగా అత్యాచారాలు జరుగుతుండటం ఆందోళన కలిగించే విషయమే కాకుండా, నేర న్యాయవ్యవస్థలోని పోలీస్, ప్రాసిక్యూషన్, కోర్టులు, జైళు ఈ నాలుగు విభాగాల పనితీరులోని డొల్లతనాన్ని ప్రశ్నిస్తోంది. నేషనల్ క్రైమ్ రికార్డు బ్యూరో డేటా ప్రకారం అత్యాచారాల కు పడిన శిక్షలు 2018 నుంచి 2022 వరకు 27 శాతం నుంచి 28 శాతం వరకే ఉన్నాయి. అంటే దేశంలో 72 శాతం అత్యాచార కేసు లు ఎలాంటి శిక్ష లేకుండానే ముగిసిపోయాయని చెప్పవచ్చు. అలాగే 2022లో బాలికలపై లైంగిక దాడి కేసులు 63 వేలకు పైగా నమోదయ్యాయి. అంటే దేశంలో ప్రతి పది నిమిషాలకు ఒక బాలికపై అత్యాచారం జరిగిందని తెలుసుకోవచ్చు. ఇన్ని జరుగుతున్నా నేరవ్యవస్థలోని నాలుగు విభాగాలు పోలీస్, ప్రాసిక్యూషన్, కోర్టులు, జైళ్లు తమ విధుల్లో సామూహిక వైఫల్యం చెందితే నేరస్థుల హృదయాల్లో శిక్ష అంటే ఏమాత్రం భయం ఉండదు. నేరాలను దర్యాప్తు చేసేది మొ దట పోలీసులే.తమ దర్యాప్తులో ఎలాంటి దౌర్బల్యాలకు చోటీయరాదు. దీనికోసం మొదట క్రైమ్‌సీన్‌ను పరిరక్షించుకోవాలి. దీనివల్ల నిపుణులు సాక్షాలను సరైన విధానంలో సేకరించ గలుగుతారు. దర్యాప్తు ప్రారంభదశలో నేరం నమోదు ఆలస్యమైతే తప్పు చే సినట్టే. కోల్‌కతా వైద్య విద్యార్థిని కేసులో ఎఫ్‌ఐఆర్ నమోదు 14 గంటలు ఆలస్యమైంది. అంతేకాకుండా క్రైమ్‌సీన్‌ను రక్షించకుండా ధ్వంసం చేశారు. దీంతో అనేక అనుమానాలు పెరిగి దర్యాప్తునే శంకించ వలసిన పరిస్థితి ఏర్పడింది. బద్లాపూర్ కేసులో కూడా ప్రజల ఆగ్రహావేశాలు కట్టలు తెంచుకున్న తరువాత పోలీస్‌లు దర్యాప్తుకు రంగంలో దిగారు. ఎఫ్‌ఐఆర్ నమోదులో వాంగ్మూలాలు రికార్డు చేయడంలో విపరీతమైన జాప్యం చేయడంపై బొంబాయి హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎఫ్‌ఐఆర్ నమోదు చేసిన తరువాత క్రైమ్‌సీన్ నుంచి బలమైన సాక్షాలను సేకరించడం, పరిశోధకుల పాత్ర, అత్యంత ప్రాధాన్యమైనవి. పోలీస్‌లు దర్యాప్తు పకడ్బందీగా నిర్వహించి సకాలంలో సంపూర్ణ న్యాయం అందేలా చూడవలసిన బాధ్య త రాష్ట్రాలదే. కానీ ఘరానా కేసులు ప్రజాందోళనల తరువాత ఎందు కు సిబిఐకి బదిలీ అవుతుంటాయి? అని ప్రశ్నించుకుంటే ఆయా రాష్ట్రాల దర్యాప్తు తీరుపై నమ్మకం లోపించడమే.దర్యాప్తు సరిగ్గా లే కుంటే ప్రాసిక్యూషన్‌కు కోర్టు విచారణల్లో అప్పీళ్లలో లీగల్ ప్రొసీడింగ్‌లో ప్రతిదశలో సమస్యలు ఎదురవుతాయి. చివరకు అత్యాచార నేరస్థులు చట్టం నుంచి తప్పించుకుని దర్జాగా బయటకు వెళ్లిపోతా రు. ప్రాసిక్యూషన్ నేరస్థులకు శిక్షపడేలా చేసినా, శిక్ష అమలులో విపరీతమైన జాప్యం చేస్తే బాధితులకు సకాలంలో న్యాయం అందించలేని వారవుతారు. 2012 ఢిల్లీ కేసులో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు గ్యాంగ్ రేప్ నేరస్థులకు ఏడాదిలోగా విచారించి ఉరిశిక్ష విధించింది. కానీ నేరస్థులకు ఏడేళ్లకు కానీ ఉరిశిక్షఅమలు కాలేదు. దేశంలో నేరన్యా య వ్యవస్థ పునస్సమీక్షించిన తరువాత క్రూరమైన కేసుల్లో ఏడేళ్లు అంతకు మించి శిక్షపడనున్న కేసుల్లో ఫోరెన్సిక్ పరీక్షలు తప్పనిసరి చేశారు. 12 ఏళ్ల కన్నా తక్కువ వయసు బాలికలపై అత్యాచారానికి పాల్పడితే జీవితకాల శిక్షలేదా మరణశిక్ష పడుతుంది. ఈ కేసుల్లో ఫోరెన్సిక్ బృందం పరీక్షలను విస్తృతం చేశారు. భారతీయ నాగరిక సురక్ష సంహిత 2024 ఫోరెన్సిక్ పరీక్షలో వీడియోటేప్ రికార్డింగ్ తప్పనిసరిగా చేయాలన్న నిబంధన విధించారు.ఫిర్యాదుల పరిశీలనకు, ఛార్జిషీట్ల దాఖలుకు గడువు నిర్ణయించారు. మహిళలపై కేసు ల విషయం లో ఎలెక్ట్రానిక్ ఎఫ్‌ఐఆర్ సిస్టమ్ ప్రవేశ పెట్టారు. దర్యా ప్తు సంస్థలు తమ విధిని సక్రమంగా సకాలంలో నెరవేర్చగలిగితేనే ఈ న్యాయ సంస్కరణలు సత్ఫలితాలు అందిస్తాయి. కానీ ప్రాథమిక దర్యాప్తులో వైఫల్యం , ఫోరెన్సిక్ సాక్షాల సేకరణలో అసంపూర్తి లేదా ఆలస్యం ఇవన్నీ చివరకు బాధితులకు న్యాయం లభించడం కష్టతరం చేస్తున్నాయి. కాబట్టి దర్యాప్తు సంస్థ క్రైమ్‌సీన్‌ను పరిరక్షించడం, సాక్షాలను సమగ్రంగా సేకరించడం అత్యంత అవసరం. అప్పుడే కేసు బలంగా ఉండి నిందితులకు శిక్షపడుతుంది. ఈ చర్యలన్నీ మహిళలపై జరిగే నేరాలను పూర్తిగా నివారించలేక పోయి నా, నేరగాళ్ల మనసులో భయం కలిగిస్తాయనడం వాస్తవం. అలాగే బాధితులు, వారి కుటుంబీకులు న్యాయం కోసం సుదీర్ఘకాలం నిరీక్షించవలసిన అగత్యం ఉండదు.

# ధర్మాన రాజకీయ సన్యాసమేనా



శ్రీకాకుళం, సెప్టెంబర్ 4 మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు వైసీపీకి దూరవేనా? ఆయన పార్టీలో కొనసాగరా? రాజకీయాల నుంచి నిష్క్రమించాలని భావిస్తున్నారా? లేకుంటే మరో పార్టీలో చేరాలనుకుంటున్నారా? ఏపీ పొలిటికల్ సర్కిల్లో ఆసక్తికర చర్చ నడుస్తోంది. పార్టీ ఓటమి నుంచి ఆయన బయటకు కనిపించడం లేదు. ఇంటి నుంచి బయటకు రావడం లేదు. కనీసం ఓటమి పై సమీక్షించలేదు. ఒక్క ప్రకటన చేయడం లేదు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడడం లేదు. నిన్నటికి నిన్న శ్రీకాకుళంలో జరిగిన వైయస్సార్ వర్ధంతి కార్యక్రమానికి కూడా హాజరు కాలేదు. స్థానికంగా ఉన్నా అటువైపుగా చూడడం లేదు. దీంతో ఆయన రాజకీయాలకు గుడ్ బై చెబుతారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. మరోవైపు కుమారుడి కోసం టిడిపిలో చేరతారని కూడా టాక్ నడుస్తోంది. అయితే తప్పనిసరి పరిస్థితుల్లో ఆయన వైసీపీలోకి వెళ్లాల్సి వచ్చిందని.. కానీ అక్కడ ఏమంత కంఫర్ట్ గా లేరన్నది గత కొద్దిరోజులుగా వినిపిస్తున్న మాట. అందుకే ఇప్పుడు పార్టీ పరిస్థితి బాగా లేకపోవడంతో.. తన మనసులో ఉన్న మాటను బయటపెట్టారని.. పార్టీ నుంచి బయటకు వస్తారని ప్రారంభమైంది.ధర్మాన ప్రసాదరావు వైయస్ రాజశేఖర్ రెడ్డికి సమకాలీకుడు. 2003లో పాదయాత్ర చేసిన సమయంలో ధర్మాన ప్రసాదరావు రాజశేఖర్ రెడ్డి కి అత్యంత సన్నిహితుడిగా మారారు. ఆ ఎన్నికల్లో నరసన్నపేట ను వదిలి శ్రీకాకుళం నుంచి పోటీ చేసి గెలిచారు ప్రసాదరావు. ఉమ్మడి రాష్ట్రంలో అత్యంత కీలకమైన రెవెన్యూ శాఖను అప్పగించారు రాజశేఖర్ రెడ్డి. ఆయన బతుకు ఉన్నంతవరకు ఒక వెలుగు వెలిగారు. కానీ జగన్ పుణ్యమా అని ధర్మాన ప్రసాదరావు చరిత్ర మసకబారుతూ వచ్చింది. తప్పనిసరి పరిస్థితుల్లో ఆయన జగన్ వెంట నడవాల్సి వచ్చింది.కాంగ్రెస్ పార్టీని విభేదించారు జగన్. సొంతంగా వైసీపీని ఏర్పాటు చేశారు. దానిని తీవ్రంగా తప్పు పట్టారు ధర్మాన ప్రసాదరావు. అప్పటికే ఆయన మంత్రిగా ఉన్నారు. జగన్ ను టార్గెట్ కూడా చేసుకున్నారు. అయితే రాష్ట్ర విభజన పుణ్యమా అని కాంగ్రెస్ పార్టీ ఏపీలో దారుణంగా నష్టపోయింది. అదే సమయంలో వైసీపీ ఆవిర్భవించింది. అప్పటివరకు జగన్ ను తిట్టిన ధర్మాన అదే పార్టీలోకి వెళ్లాల్సి వచ్చింది. అది రాజకీయంగా కూడా మైనస్ గా మారింది. 2014 ఎన్నికల్లో ధర్మాన ప్రసాదరావు వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసినా ఓటమి తప్పలేదు. పోనీ జగన్ విడిచిపెడతామని భావించినా ప్రత్యామ్నాయం లేదు. దీంతో 2019 ఎన్నికల్లో గెలిస్తే మంత్రి పదవి ఇస్తారని భావించి వైసీపీలో కొనసాగారు ధర్మాన ప్రసాదరావు.2019 ఎన్నికల్లో జగన్ ప్రభంజనంలో గెలిచారు ధర్మాన ప్రసాదరావు. కానీ ఆయనకు కాకుండా సోదరుడు ధర్మాన కృష్ణ దాస్ ను క్యాబినెట్ లోకి తీసుకున్నారు జగన్. ఈ నిర్ణయం ధర్మానకు మనస్థాపానికి గురిచేసింది. ఏ మంత్రి పదవి కోసం ఎన్ని రోజులు జగన్ వెంట ఉన్నారో.. అదే పదవి దక్కకపోయేసరికి ధర్మానలో ఒక రకమైన అసంతృప్తి కనిపించింది. దీంతో పరిస్థితి చేయి దాటుతుందని భావించిన జగన్ విస్తరణలో ధర్మానకు ఛాన్స్ ఇచ్చారు. కానీ మునుపటిలా స్వేచ్ఛ లేదు. దీంతో అసంతృప్తితోనే మంత్రి పదవిని అనుభవించారు. ఈ ఎన్నికల్లో ఒక సాధారణ సర్పంచ్ చేతిలో ఓడిపోయారు. ఇష్టం లేని వైసీపీలో ఉండలేక.. ప్రత్యామ్నాయం లేక రాజకీయ సన్యాసం దిశగా అడుగులు వేస్తున్నారు. అయితే కుమారుడి రాజకీయ భవిష్యత్తు కోసం టిడిపిలో చేరతారన్న ప్రచారం అయితే ఉంది. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# తిరుపతికి ఇంటర్నేషనల్ ప్లేన్

తిరుమల, సెప్టెంబర్ 4, తిరుపతి (రేణిగుంట) ఎయిర్‌పోర్టులో చాలా రోజుల తర్వాత అంతర్జాతీయ విమానం ఎంట్రీ ఇచ్చింది. దాదాపు తొమ్మిదేళ్ల తర్వాత తొలిసారిగా ఓ అంతర్జాతీయ విమానం సేఫ్‌గా ల్యాండ్ అయ్యింది. 2015 నవంబరు 22న తిరుపతిలో అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభించి జాతికి అంకితం చేశారు. ఆ తర్వాత అంతర్జాతీయ విమానాల రాకపోకలు కొనసాగాయి.. అంతర్జాతీయ విమాన రాకపోకల కోసం అన్ని వసతులను కల్పించారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అంతర్జాతీయ విమానాల రాకపోకలపై ఫోకస్ పెట్టలేదనే విమర్శలు వచ్చాయి.ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగా.. మూడు నెలల్లోపే అంతర్జాతీయ విమానం ల్యాండ్ అయ్యింది. బహ్రెయిన్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఎంపైర్ ఏవియేషన్ విమానం తిరుపతి ఎయిర్‌పోర్టుకు వచ్చింది. గల్ఫ్‌లో కేరళకు చెందిన ప్రవాస భారతీయుడు డాక్టర్ రవిపిళ్లై కుటుంబ సభ్యులతో కలిసి ఈ విమానంలో శ్రీవారి దర్శనార్థం తిరుపతికి వచ్చారు. ఏటా శ్రీవారి దర్శనానికి వచ్చే పిళ్లై ఈసారి కేంద్రం అనుమతితో ప్రత్యేక విమానంలో వచ్చారు. రాబోయే రోజుల్లో అంతర్జాతీయ విమాన సర్వీసులు నడపడానికి ఇది తొలి అడుగుగా భావిస్తున్నారు. రవిపిళ్లైకి విమానాశ్రయంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ స్వాగతం పలికారుసౌదీ అరేబియాలోని బెహరిన్ విమానాశ్రయం నుంచి ఈ ప్రత్యేక విమానం రేణిగుంట అంతర్జాతీయ విమానాశ్రయానికి వచ్చింది. భారతీయ విమానాశ్రయ అధికారులు ప్రత్యేక విమానంలో వచ్చిన వారికి,అధికారులు పూర్తి సహాయ సహకారాలు అందించారు.అతి త్వరలో అంతర్జాతీయ విమానాలను

తిరుపతి విమానాశ్రయంలో ప్రయాణికులతో ప్రారంభిస్తామని ఎయిర్‌పోర్ట్ అధికారులు తెలిపారు. తిరుమల శ్రీవారి దర్శనానికి నిత్యం వేలాదిమంది భక్తులు తరలివస్తుంటారు. అయితే కొందరు విదేశాల నుంచి నేరుగా తిరుపతికి వచ్చేందుకు విమాన సౌకర్యం లేదు.. వారు హైదరాబాద్, విజయవాడ వెళ్లి అక్కడి నుంచి మళ్లీ తిరుపతికి వెళ్లాల్సి వస్తుంది. ఇలాంటి సమయంలో అంతర్జాతీయ విమాన సర్వీసుల్ని తిరుపతి ఎయిర్‌పోర్టుకు నడిపితే ఉపయోగకరంగా ఉంటుందని చెబుతున్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సర్వీసులు నడపాలని కోరుతున్నారు.

# వైసీపీలో వలసలు ఆగినట్టేనా

నెల్లూరు, సెప్టెంబర్ 4, వైసీపీలో వలసలు ఆగినట్లేనా? లేక తాత్కాలికమా? ఇక వెళ్లేవారు ఎవరూ లేరా? అంటే రాజ్యసభ సభ్యుల్లో మాత్రం లేరనే చెప్పాలి. ఎందుకంటే మిగిలిన రాజ్యసభ సభ్యులు ఎక్కువ మంది తాము జగన్ పార్టీలోనే ఉంటామని చెప్పారు. మరికొందరు నేరుగా చెప్పకపోయినా జగన్ కు అత్యంత ఇష్టులు, సన్నిహితులు కావడంతో వారు కూడా పార్టీ మారే అవకాశం లేదంటున్నారు. ఇక రాజ్యసభ పదవికి రాజీనామా చేస్తే మళ్లీ చంద్రబాబునాయుడు తమను పెద్దల సభకు ఎంపిక చేస్తారన్న గ్యారంటీ కూడా లేదు. దీంతో ఇక దాదాపుగా వలసలు ఆగిపోయినట్లేనని పార్టీ నేతలు అభిప్రాయపడుతున్నారు. కానీ ఎమ్మెల్సీలు మాత్రం పార్టీని వీడే అవకాశాలున్నాయి.. వైసీపీకి రాజ్యసభ సభ్యులు మొత్తం పదకొండు మంది ఉన్నారు. వీరిలో మోపిదేవి వెంకటరమణ, బీద మస్తాన్ యాదవ్ లు పార్టీని వీడి వెళ్లారు. వీరు టీడీపీలో చేరుతున్నా వారికి రాజ్యసభ పదవి ఇచ్చే అవకాశం లేదంటున్నారు. ఇక మిగిలిన తొమ్మిది మందిలో ఆర్ కృష్ణయ్య, మేడా రఘునాథరెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, విజయసాయిరెడ్డి, గొల్ల బాబూరావులు క్లారిటీ ఇచ్చారు. తమ రాజకీయ ప్రయాణం జగన్ తోనేనని తేల్చి చెప్పారు. అంటే ఆరుగు రాజ్యసభ సభ్యులు ఈ విషయాన్ని చెప్పారు. ఇక మిగిలిన ఇద్దరు సభ్యుల్లో వైవీ సుబ్బారెడ్డి పార్టీ మారే అవకాశమే లేదు. మరొక సభ్యుడు పరిమళ నత్వాని కూడా రాజీనామా చేయకపోవచ్చు. దీంతో తొమ్మిది మంది రాజ్యసభ సభ్యులు పార్టీనే అంటిపెట్టుకునే ఉంటారన్న భరోసా పార్టీ అధినేత జగన్ లో ఉంది. ఎమ్మెల్సీల విషయంలో... మరోవైపు ఎమ్మెల్సీల విషయంలో ఈ గ్యారంటీ లేదు.ఎందుకంటే ఇప్పటికే ముగ్గురు ఎమ్మెల్సీలు పార్టీని వదిలి పెట్టి వెళ్లారు. మిగిలిన వారు వెళ్లరన్న గ్యారంటీ లేదు. ఎందుకంటే వైఎస్ జగన్ ఎమ్మెల్సీ పదవులు పార్టీ పట్ల అంకితభావం, నిబద్ధత లేని వారికి ఇచ్చారని పార్టీ వర్గాలే అంగీకరిస్తున్నాయి. టీడీపీ అధినేత చంద్రబాబు కేవలం ఎమ్మెల్సీలు, రాజ్యసభ సభ్యుల మీదనే ఫోకస్ పెట్టారు. ఎందుకంటే ఏ పదవి ఖాళీ అయినా అది తమ కూటమి ఖాతాలోనే పడుతుంది. ఎమ్మెల్యేలు వైసీపీకి పదకొండు మంది ఉన్నా వారి జోలికి వెళ్లదలచుకోలేదు. దీనికి కారణం కూడా లేకపోలేదు. పార్టీలోకి రావాలంటే రాజీనామా చేయాలని షరతు పెట్టడంతో ఏ ఎమ్మెల్యే రాజీనామాకు అంగీకరించే అవకాశం అయితే లేదు. మరో వైపు వైసీపీ అధినేత జగన్ యూకే పర్యటనకు వెళుతున్నారు. దాదాపు ఇరవై రోజుల పాటు ఆయన రాష్ట్రంలోనే ఉండరు. ఈ సమయంలో పార్టీ మారేందుకు ఎమ్మెల్సీలు సిద్ధపడతారా? అన్న చర్చ జరుగుతుంది. వారిని ఆపేందుకు జగన్ కూడా అందుబాటులో ఉండరు. ఇదే కరెక్ట్ సమయమని జంపింగ్ నేతలు భావిస్తారు. అందుకే సెప్టంబరు నెలలో ఎక్కువగా ఎమ్మెల్సీలు మారతారన్న ప్రచారం జరుగుతుంది. కానీ ఎమ్మెల్సీలు కూడా తమకు పదవి తిరిగి ఇస్తామని గ్యారంటీ టీడీపీ నుంచి వస్తే తప్ప మారరు. కానీ చంద్రబాబు ఇప్పుడున్న పరిస్థితుల్లో పార్టీ మారుతున్న వారికి అలాంటి హామీ ఇచ్చే అవకాశం లేదన్న భరోసా తప్ప వైసీపీ నేతల్లో మరొకటి కనిపించడం లేదు. మరి ఈ ఇరవై రోజుల్లో ఏం జరుగుతుందో చూడాలి మరి.

# రిటైనింగ్ వాల్ రాజకీయం

విజయవాడ, సెప్టెంబర్ 4 విజయవాడ వాసులని ఊహించని వరదలు ముంచెత్తాయి. సింగ్‌నగర్‌తో పాటు నగర శివారు ప్రాంతాలన్నీ నీట మునిగాయి. అక్కడి వారంతా ఉంటున్న ఇళ్లు వదిలి తట్టాబుట్టా సద్దుకుని... పునరావాసకేంద్రాల్లో ఉండాల్సిన పరిస్థితి. అలా కాకపోతే... ముంపులోనే కాలం వెళ్లదీయాల్సిన దుస్థితి. అయితే... ఎప్పుడూ నీట మునిగే... కృష్ణలంక, రాణిగారితోట ప్రాంతాలు మాత్రం వరద ముంపు నుంచి తప్పించుకున్నాయి. దీనికి కారణం కృష్ణలంక రిటైనింగ్ వాల్. ఇదే ఆ ప్రాంతాలను వరద ముంచెత్తకుండా కాపాడింది. వేల కుటుంబాలను కాపాడింది. రిటైనింగ్ వాల్ లేకపోయింటే... కృష్ణలంకతోపాటు రాణిగారితోట మునిగిపోయేవి. రిటైనింగ్ వాల్.. ఆ రెండు ప్రాంతాలను కాపాడింది. ఇది చాలా సంతోషించాల్సిన విషయం... అయితే ఏపీలో ఈ అంశమే ఇప్పుడు రాజకీయ రగడకు కారణమైంది. వేలాది కుటుంబాలను వరద ముప్పు నుంచి తప్పించిన కృష్ణలంక రిటైనింగ్‌ను కట్టింది తామంటే తామని అంటున్నాయి టీడీపీ, వైసీపీ. రిటైనింగ్ వాల్ క్రెడిట్ కోసం పోటీ పడుతున్నాయి. కృష్ణలంక రిటైనింగ్ వాల్ మొత్తం 12లక్షల క్యూసెక్కుల నీటిని తట్టుకునేలా దీన్ని నిర్మించారు. 474.51 కోట్లతో.. మొత్తం.. 3.44 కిలోమీటర్ల పొడవున ప్రకాశం బ్యారేజీ కింద ఈ వాల్ నిర్మాణం జరిగింది. మొత్తం ఆరు డివిజన్లకు రక్షణగా ఈ ప్రవహరీ గోడను ఏర్పాటు చేశారు. దీని వల్ల... ఇప్పుడు వేలాది కుటుంబాలు ముంపు బారిన పడకుండా తప్పించుకున్నాయి. కృష్ణలంక రిటైనింగ్ వాల్ లేకపోయింటే... విజయవాడలో కలలో కూడా ఊహించలేని విధ్వంసం జరిగి ఉండేదిరిటైనింగ్ నిర్మాణంపై ఇప్పుడు టీడీపీ , వైఎస్‌ఆర్‌సీపీ మధ్య మాటల యుద్ధం జరుగుతోంది. రిటైనింగ్ వాల్ కట్టింది తామే అని వైఎస్‌ఆర్‌సీపీ అంటుంటే... చరిత్ర తెలుకోకుండా మాట్లాడొద్దని టీడీపీ కౌంటర్ ఇస్తోంది..? ఇంతకీ రిటైనింగ్ వాల్ క్రెడిట్ ఎవరికి దక్కుతుంది...? అసలు ఏం జరిగింది...?విజయవాడ కృష్ణ రివర్ రిటైనింగ్ వాల్ ప్రాజెక్టు ఫేజ్-1 నిర్మాణ పనులు కాంగ్రెస్ హయాంలో 2009లో ప్రారంభించారు. 2009 నుంచి 2019 వరకు టీడీపీ హయాంలో కనీసం ఫేజ్-1 పనులు కూడా పూర్తిచేయలేకపోయారు. 2019లో వైఎస్ జగన్ ప్రభుత్వం ఏర్పడింది. వైఎస్‌ఆర్‌సీపీ హయాంలోనే రిటైనింగ్ వాల్ ఫేజ్-1 నిర్మాణ పనులతోపాటు ఫేజ్-2, ఫేజ్-3 కూడా పూర్తి చేస్తామని వైఎస్‌ఆర్‌సీపీ అంటోంది. తాము పూర్తిచేసిన కృష్ణలంక రిటైనింగ్ వాల్... విజయవాడకి ఒక రక్షణ వలయాన్ని ఏర్పాటు చేసింది. విజయవాడలో ఎన్నో వేల కుటుంబాల ప్రాణాలు, ఆస్తులను కాపాడింది. తాము నిర్మించింది ఈ రిటైనింగ్ వాల్‌కు... విజయవాడ చరిత్రలో ఎప్పటికీ ఒక ప్రత్యేక స్థానం ఉంటుందని వైసీపీ చెప్తోంది. అంతేకాదు.. మంచి చేసేందుకు మనసు రాని చంద్రబాబు.... జగన్ ప్రభుత్వంలో నిర్మించిన రిటైనింగ్ వాల్ క్రెడిట్‌ను కొట్టేసేందుకు ముందుంటాడంటూ విమర్శిస్తున్నారు.కృష్ణలంక దగ్గర రిటైనింగ్ వాల్ 2019లో చంద్రబాబు హయాంలోనే నిర్మించారని టీడీపీ శ్రేణులు అంటున్నారు. కృష్ణలంక ప్రజలకు మేలు చేసింది చంద్రబాబే అంటూ పోస్టులు పెడుతున్నారు

# వరదబాధితులకు సాయంగా టాలీవుడ్

ఇరు రాష్ట్రాలకు కోటి సాయం ప్రకటించిన మెగాస్టార్



హైదరాబాద్,సెప్టెంబర్4: దేశంలో ఎప్పుడు, ఎలాంటి కష్టం వచ్చినా టాలీవుడ్ పరిశ్రమ కూడా తనవంతుగా సాయం అందిస్తోంది. గత నెలలో కేరళ వాయనాడ్ వరదల నేపథ్యంలో మొదటగా స్పందించి సాయం అందించింది టాలీవుడ్ మాత్రమే. ఇప్పుడు మన రెండు ఉభయ తెలుగు రాష్ట్రాలు వరదల వల్ల తీవ్రంగా నష్టపోయిన నేపథ్యంలో బాధితులను ఆదుకునేందుకు టాలీవుడ్ సెలబ్రిటీలు చాలామంది ముందుకొచ్చి విరాళాలు ప్రకటిస్తున్నారు. ఇప్పటికే జూనియర్ ఎన్టీఆర్, సూపర్ స్టార్ మహేష్ బాబు, పవన్ కల్యాణ్, బాలకృష్ణ, విశ్వక్ సేన్, సిద్దు జొన్నలగడ్డ, కథానాయిక అనన్య నాగళ్ల, యాంకర్ స్రవంతి, దర్శకుడు త్రివిక్రమ్, నిర్మాతలు రాధాకృష్ణ, వంశీ, ఆయ్ మూవీ టీం తమవంత సాయంగా ప్రకటించగా తాజాగా మెగాస్టార్ చిరంజీవి రూ. 50 లక్షల చొప్పున రెండు తెలుగు రాష్ట్రాలకు రూ. కోటి విరాళం ప్రకటించారు. గత నెలలో వయనాడ్ వరదల నేపథ్యంలోనూ చిరంజీవి ఆ రాష్ట్ర సీఎం సహాయ నిధికి రూ. కోటి ఇవ్వడం విశేషం. ఈ సందర్భంగా చిరంజీవి తన సోషల్ మీడియా ద్వారా స్పందిస్తూ.. వరద ప్రభావం వల్ల ప్రజలకు కలిగిన, కలుగుతున్న కష్టాలు నన్ను కలిచివేస్తున్నాయి. పదుల సంఖ్యలో అమాయక ప్రాణాలు కోల్పోవడం ఎంతో విషాదకరం. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల నిర్దేశకలో రెండు ప్రభుత్వాలు శాయాశక్తులా పరిస్థితిని మెరుగు పరచడానికి కృషి చేస్తున్నాయి. మనందరం ఏదో విధంగా సహాయక చర్యల్లో పాలుపంచుకోవాల్సిన అవసరం ఉంది. ఈ ప్రక్రియలో భాగంగా రెండు రాష్ట్రాల్లో ప్రజల ఉపశమనానికి తోడ్పాటుగా నా వంతు కోటి రూపాయలు సీఎంల రిలీఫ్ ఫండ్‌కు చెరో 50 లక్షలు విరాళంగా ప్రకటిస్తున్నాను. ఈ విపత్కర పరిస్థితులు తొందరగా తొలగిపోవాలని, ప్రజలంతా సురక్షితంగా ఉండాలని భగవంతుని ప్రార్థిస్తున్నానని అంటూ తన సానుభూతిని తెలియజేశారు.

# పాపం... బైరెడ్డి

కర్నూలు, సెప్టెంబర్ 4,వైసీపీ యువనేత బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి చుట్టూ ఉచ్చు బిగిస్తోంది. హత్య కేసులో ఆయనకు ఇబ్బందులు తప్పవని న్యాయ నిపుణులు చెబుతున్నారు. ఓ హత్య కేసులో ప్రధాన నిందితుడితో సిద్ధార్థ రెడ్డి ఫోన్లో మాట్లాడిన వాయిస్ కాల్ ఒకటి బయటకు వచ్చింది. అదే కేసులో సిద్ధార్థ రెడ్డి అనుమానితుడు కూడా. అయితే ప్రధాన నిందితుడితో సిద్ధార్థ రెడ్డి మాట్లాడిన వాయిస్ కాల్స్ కు సంబంధించిన సంభాషణలు హత్యకు గురైన వ్యక్తి కుమార్తెకు దొరకడం విశేషం. ఇప్పటికే ఈ హత్య కేసులో బైరెడ్డి సిద్ధార్థ రెడ్డికి ఎలాగైనా శిక్ష పడాలని మృతుడి కుమార్తె భావిస్తోంది. సరిగ్గా ఇటువంటి సమయంలోనే ఆమెకు కీలక సాక్షాలు చిక్కడం విశేషం. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని నందికొట్కూరు మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ తెలుగు సాయి ఈశ్వరుడు 2014లో దారుణంగా హత్యకు గురయ్యారు. దీనిపై కర్నూలు సిటీ మూడో పట్టణ పోలీస్ స్టేషన్లో కేసు నమోదయ్యింది. ప్రధాన నిందితుడు చికెన్ భాషా కాగా.. వైసీపీ నాయకులు బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి, బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి అనుచరుల మీద కేసులు నమోదు అయ్యాయి. విజయవాడ కోర్టులో కేసు విచారణ జరిగింది. అయితే ఈ కేసుకు సంబంధించి ప్రధాన నిందితుడిగా ఉన్న చికెన్ బాషా తో బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ఫోన్లో మాట్లాడారు. ఆ వాయిస్ కాల్ రికార్డ్ మృతుడు కుమార్తె జ్యోతికి దొరికాయి. దీంతో ఈ వాయిస్ కాల్ రికార్డింగ్ సాక్ష్యాలుగా పరిగణించాలని

ఆమె కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే ఆ పిటిషన్ ను విజయవాడ కోర్టు తిరస్కరించింది. విజయవాడ కోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ జ్యోతి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తాజాగా విచారించిన హైకోర్టు విచారణను సెప్టెంబర్ ఐదో తేదీకి వాయిదా వేసింది. దీంతో బైరెడ్డి సిద్ధార్థ రెడ్డికి ఇబ్బందులు తప్పవని న్యాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు.వైసిపి ఓడిపోవడంతో బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ఐదేళ్ల వైసిపి హయాంలో సిద్ధార్థ రెడ్డి దూకుడుగా వ్యవహరించారు. నందికొట్కూరు షాడో ఎమ్మెల్యేగా పనులు చక్కబెట్టారు. సోషల్ మీడియాలో సైతం యాక్టివ్ గా ఉండేవారు. దీంతో బైరెడ్డి సిద్ధార్థ రెడ్డికి ఫ్యాన్ ఫాలోయింగ్ పెరిగింది. జగన్మోహన్ రెడ్డి సైతం శాప్ ఛైర్మన్ గా అవకాశం ఇచ్చారు. క్రీడల శాఖ మంత్రిగా ఉండే రోజాతో పాటు సిద్ధార్థ రెడ్డి హల్చల్ చేసేవారు. ముఖ్యంగా చంద్రబాబుతో పాటు లోకేష్ లపై విరుచుకుపడేవారు.వైసీపీ ఓటమి తర్వాత సైలెంట్ అయ్యారు.బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి స్వయానా బాబాయ్ రాజశేఖర్ రెడ్డి. ఎన్నికలకు ముందు తెలుగుదేశం పార్టీలో చేరారు ఆయన. రాజశేఖర్ రెడ్డి కుమార్తె బైరెడ్డి శబరి కి నంద్యాల టికెట్ ఇచ్చారు చంద్రబాబు. మంచి మెజారిటీతో ఎంపీగా ఆమె విజయం సాధించారు. పార్లమెంట్ లో అడుగుపెట్టారు. అయితే ఆది నుంచి నందికొట్కూరు నియోజకవర్గంపై దృష్టి పెట్టారు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి.అది ఎస్సీ నియోజకవర్గం కావడంతో.. అక్కడ పోటీ చేసేందుకు వీలు లేకపోయింది. అయినా సరే తనకు నచ్చిన ఎస్సీ అభ్యర్థిని నిలబెడుతూ షాడో ఎమ్మెల్యేగా వ్యవహరించేవారు. కానీ ఈసారి బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి సూచించిన నేతకు కాకుండా.. పక్క జిల్లా నాయకుడికి అవకాశం ఇచ్చారు జగన్. అయినా ఆయన ఓడిపోయారు.రాజకీయంగా కూడా వరుసగా బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి కి షాక్ లు తగులుతున్నాయి. నందికొట్కూరు మున్సిపాలిటీ ఇప్పటికే చేజారింది. అక్కడ మున్సిపల్ చైర్మన్ తో పాటు కౌన్సిలర్లంతా టిడిపిలో చేరారు. సరిగ్గా ఇటువంటి సమయంలోనే పాత కేసు వెలుగులోకి వచ్చింది. పట్టు బిగించినట్లు కనిపిస్తోంది.

## బుడమేరు విశ్వరూపమే విజయవాడకు శాపం

**సగం బెజవాడాపై అనకొండలా విజృంభణ**

**అధికారుల నిర్లక్ష్యంతో నష్టం రెట్టింపు**

విజయవాడ,సెప్టెంబర్4(): చూడడానికి పెద్ద సైజు మురికి కాలువలా ఉండే బుడమేరు ఎప్పుడు వరదలు వచ్చినా విశ్వరూపం చూపిస్తుంది. దీనికి కారణం కాలువలను ఆక్రమించి ఇల్లు నిర్మించుకోవడంతో అది వరదలు వచ్చినప్పుడు తన ప్రతాపం చూపిస్తోంది. ఎప్పుడు వదలు వచ్చినా బడమేరు ఉప్పొంగ కుండా ..వరద నష్టం లేకకుండా జరగడం లేదు. ఇదేదో డ్రైనేజీలే అనుకునేంతగా ఉన్నా.. వరదల సమయంలో పెద్దసైజు నదిలా బుడమేరు విజృంభిస్తుంది. ఇప్పుడు విజయవాడ ఊరును.. ఏరుగా మార్చేసి కన్నీరు పెట్టేలా చేసింది. సగం విజయవాడను ముంచెత్తింది. బెజవాడకు ఏంటీ బుడమేరు శాపం? అసలేం జరిగింది? అధికారుల అలసత్వమే కొంప ముంచిందా? విజయవాడకు చేరక ముందే బుడమేరు ప్రతాపం మొదలైంది. దారిలో కనిపించిన ఊరునల్లా ముంచుకుంటూ వచ్చిన బుడమేరు.. ఆదమరిచి ఉన్న బెజవాడ మీద జల సర్పంలా విరుచుకుపడింది. ఆనకట్ట తెగిన అనకొండలా.. సింగ్ నగర్ ప్రాంతాన్ని మింగేసింది. బుడమేరకు పడ్డ గండ్లు, దాని ధాటికి తెగిపోయిన చెరువులు.. విజయవాడతో పాటు నాలుగైదు పల్లెటూళ్లను కూడా నామరూపాలు లేకుండా చేసింది. విజయవాడలో ఆరున్నర లక్షలాది మందికి నిలువ నీడ లేకుండా చేసింది. ఊరును ముంచేసింది. అంటే బెజవాడలో మూడో వంతుమంది బుడమేరు బారిన పడ్డారని చెప్పాల్సిందే. విజయవాడకు దాదాపు 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ వెలగలేరు రెగ్యులేటర్ ద్వారానే బుడమేరు వరదను కంట్రోల్ చేస్తారు. విజయవాడలో చూడడానికి చిన్న కాలువలా ఉండే బుడమేరు.. ఇదిగో ఈ వెలగలేరు నుంచే బయల్దేరి.. మహోగ్ర వరద రూపంలో విజయవాడలో జల విలయం సృష్టించింది. మైలవరం, ఏ కొండూరు, జీ కొండూరు కొండల్లో పుట్టే బుడమేరు..వెలగలేరు రెగ్యులేటర్ దగ్గర రెండుగా చీలుతుంది. ఒక ప్రవాహం ఇబ్రహీంపట్నం, ఆగిరిపల్లి మీదుగా కృష్ణా నదిలోకి వెళుతుంది. మరో పాయ.. విజయవాడ నగరం మీదుగా వెళ్లి.. కొల్లేరుకు చేరుకుంటుంది. విజయవాడలోకి రాకుండా ఈ వరదను ఇబ్రహీంపట్నం మీదుగా కృష్ణా నదికి మళ్లిస్తారు. ఒకవేళ కృష్ణా నదిలో వరద, పోటు ఎక్కువగా ఉంటే.. వరదను విజయవాడలోకి వదులుతారు. మొన్న వర్షాలకు శనివారం సాయంత్రం నాలుగు గంటలకు బుడమేరులో వేలాది క్యూసెక్కుల వరద పోటెత్తింది. దీంతో వెలగలేరు రెగ్యులేటర్ నుంచి బుడమేరు వరదను విడుదల చేశారు. అటు కృష్ణా నదిలో వరద ప్రవాహం పెరగడం, ప్రకాశం బ్యారేజీకి వరద ఉధృతి ఎక్కువవడంతో.. బుడమేరు వరదను విజయవాడ వైపునకు వదిలేశారు. వెలగలేరు రెగ్యులేటర్ ద్వారా కృష్ణలోకి వరదను వదిలినా.. అది నదిలోకి వెళ్లే పరిస్థితి లేకపోవడం, వెనక్కి తన్నే అవకాశం ఉండడంతో.. విజయవాడలోకి నీటిని వదిలేశారు. బుడమేరుకు వచ్చిన భారీ వరదను విజయవాడలోకి వదిలేసిన అధికారులు.. ప్రజలను అప్రమత్తం చేయడంలో నిర్లక్ష్యం, అలసత్వం వహించారు. ప్రజలను సరైన సమయంలో అప్రమత్తం చేయడంలో అధికారులు విఫలమయ్యారు. దీంతో ఆదివారం ఉదయం.. జనం నిద్ర లేచే సమయానికి విజయవాడ మీద బుడమేరు విరుచుకుపడింది. డజన్ల కొద్దీ కాలనీలు నీట మునిగిపోయాయి. 10 అడుగుల పైన వరద రావడంతో జనం కకావికలమైపోయారు. ఇక బుడమేరు విజయవాడకు వెళ్లే దారి పొడవునా విధ్వంసం సృష్టించింది. అనేక చెరువులకు, కాలువలకు కొన్ని వందల చోట్ల గండ్లు పడేలా చేసింది. బుడమేరుకు ఈ స్థాయిలో వరద వస్తుందని ఊహించలేదు. దీనికితోడు అధికారుల నిర్లక్ష్యం, విజయవాడ పరిసరాల్లో ఆక్రమణలు.. ఇలా అన్నీ కలిసి బెజవాడను ముంచెత్తాయి. ఇప్పుడు దాని ప్రభావం ఎంత అన్నది నష్టం అంచనాల్లో తేలుతుంది.

## శ్రీశైలం జలవిద్యుత్ కేంద్రంలో భారీ పేలుడు

**పేలు శబ్దాలతో పరుగులు తీసిన సిబ్బంది**

**తరవాత సరిచేసి..విద్యుత్ ఉత్పత్తి ప్రారంభం**

నంద్యాల,సెప్టెంబర్4: శ్రీశైలం కుడిగట్టు జలవిద్యుత్ కేంద్రంలో భారీ పేలుడు సంభవించింది. ఏడో నంబర్ యూనిట్‌లో కండెన్సర్ కాలిపోయి భారీ శబ్దాలతో పేలుడు జరిగింది. పవర్ హౌస్‌లో వచ్చిన శబ్దాలకు సిబ్బంది పరుగులు పెట్టారు. కాసేపు ఏం జరిగింతో అర్థంకాక ఉద్యోగులు అయోమయానికి గురయ్యారు. అసలే జలశయానికి వరద ఉధృతి అధికంగా ఉండడంతో ఏం జరిగిందో అని భయాందోళన కు గురయ్యారు. ప్రమాదం జరిగిన వెంటనే అధికారులు ఏడో నంబర్ యూనిట్‌లో విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేశారు. అనంతరం సమస్యను గుర్తించిన అధికారులు సాంకేతిక లోపం తలెత్తి శబ్దాలు వచ్చినట్లు తెలిపారు. కండెన్సర్ కాలిపోయి పేలుడు సంభవించినట్లు గుర్తించి మరమ్మతులు చేపట్టారు. సమస్యను పరిష్కరించిన విద్యుత్ ఉత్పత్రి ప్రారంభించేందుకు చర్యలు చేపట్టారు. మరోవైపు శ్రీశైలం జలాశయానికి వరద ఉధృతి కాస్త తగ్గింది. ప్రాజెక్టు ఇన్ ఫ్లో 99,615క్యూసెక్కులు కాగా.. ఔట్ ఫ్లో 1,81,235 క్యూసెక్కులు గా ఉంది. దీంతో జలాశయం 6గేట్లు 10అడుగుల మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 885అడుగులు కాగా.. ప్రస్తుతం 883.50అడుగులకు చేరుకుంది. ఈ క్రమంలో శ్రీశైలం జల విద్యుత్ కేంద్రంలోని పవర్ హౌస్‌లో బుధవారం భారీ పేలుడు శబ్దం వినిపించింది. దీంతో వెంటనే అప్రమత్తమైన అధికారులు విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేశారు. సాంకేతిక లోపం తలెత్తడంతో ఏడో నంబర్ యూనిట్‌లో విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేసినట్లు అధికారులు ప్రకటించారు. శ్రీశైలం విద్యుత్ కేంద్రంలో భారీ పేలుడు శబ్దం వినిపించడంతో విధుల్లో ఉన్న ఉద్యోగులు భయాందోళనకు గురయ్యారు. కాగా, సాంకేతిక లోపంతో నిలిచిపోయిన విద్యుత్ ఉత్పత్తి యూనిట్‌లో అధికారులు మరమ్మతు పనులు చేపట్టారు. ఈ పేలుడుకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## కొట్టుకు పోయిన వాహనాల కోసం వెతుకులాట

విజయవాడ,సెప్టెంబర్4: విజయవాడలో కురిసిన భారీ వర్షాలు, ముంచెత్తిన వరదలకు కొట్టుకు పోయిన వాహనాల కోసం వెతుకులాట మొదలు పెట్టారు. కొట్టుకుపోయిన తమ వాహనాలు సితార, చిట్టినగర్ ప్రాంతాల్లో తేలుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వాహనాలు కాలువల్లో తేలుతూ ఉండటం చూసి బాధపడ్డారు. మరికొందరు వారి వాహనాలకు కోసం పలు ప్రాంతాల్లో ఇంకా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. వరద నీటిలో చిక్కుకున్న వేలాది వాహనాలకు ప్రకృతి వైపరిర్యాల దృష్ట్యా ఇన్సూరెన్స్ వర్తించదు. అయితే ఆయా ఇన్సూరెన్స్ కంపెనీలతో మాట్లాడి బాధితులకు పరిహారాన్ని ఇప్పించే లాగా కూడా చర్యలు తీసుకోవడానికి ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

# ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన




**మహా మనిషి సర్వేపల్లి రాధాకృష్ణన్**

**-నేడు ఆయన జయంతి (ఉపాధ్యయ దినోత్సవం)**

**ఉపాధ్యాయవృత్తికే వన్నె తెచ్చిన**

మహా మనిషి సర్వేపల్లి రాధాకృష్ణన్, వృత్తి రీత్యా, వ్యక్తిత్వ రీత్యా, సంస్కార రీత్యా సర్వేపల్లి మహోన్నతుడు. పువ్వు పుట్టగానే పరిమళిస్తుందన్నట్టు చిన్నతనం నుంచి అసాధారణ ప్రజ్ఞా పాటవాలను ప్రదర్శించిన డాక్టర్ సర్వేపల్లి.. స్వశక్తితో ఉన్నత శిఖరాలకు ఎదిగి పలువురికి మార్గదర్శకంగా, తన వృత్తి ధర్మానికి మకుటంగా వెలిగారు. గురువులకే గురువుగా ఉపాధ్యాయవృత్తికే ఆదర్శంగా నిలిచారు ఆయన..

సర్వేపల్లి రాధాకృష్ణన్ సెప్టెంబర్ 5, 1888 జన్మించి? ఏప్రిల్ 17, 1975 మరణించారు. భారతదేశపు మొట్టమొదటి ఉపరాష్ట్రపతి మరియు రెండవ రాష్ట్రపతి కూడా. అంతేకాదు భారతీయ తాత్వికచింతనలో పాశ్చాత్య తత్వాన్ని ప్రవేశ పెట్టినాడని ప్రతీతి. రెండు పర్యాయాలు ఉపరాష్ట్రపతి పదవి చేపట్టి, తరువాత రాష్ట్రపతిగా ఒక పర్యాయం పదవిని చేపట్టి, భారతదేశపు అత్యంత క్లిష్టకాలంలో(చైనా, పాకిస్తానులతో యుద్ధ సమయం) ప్రధానులకు మార్గనిర్దేశం చేశారు.సర్వేపల్లి రాధాకృష్ణన్ 5-9-1888న మద్రాసుకు ఈశాన్యంగా 64 కి.మీల దూరమున ఉన్న తిరుత్తణిలో సర్వేపల్లి వీరస్వామి, సీతమ్మ దంపతులకు జన్మించాడు. వారి మాతృభాష తెలుగు. సర్వేపల్లి బాల్యము, విద్యాభ్యాసము ఎక్కువగా తిరుత్తణి మరియు తిరుపతిలోనే గడిచిపోయాయి. ప్రాథమిక విద్య తిరుత్తణిలో సాగింది. తిరుపతి, నెల్లూరు, మద్రాసు క్రిస్టియన్ కాలేజీ మున్నగుచోట్ల చదివి ఎం.ఏ పట్టా పొందాడు. బాల్యం నుండి అసాధారణమైన తెలివితేటలు కలవాడాయాన. 1906లో 18 సంవత్సరాల చిరుప్రాయంలో శివకామమ్మతో వివాహము జరిగింది. వీరికి ఐదుగురు కూతుళ్ళు, ఒక కుమారుడు కలిగారు.

వీళ్లది చాలాపేద కుటుంబం. ఉన్నత విద్య చదివించే స్తోమత లేదని తండ్రి వీరాస్వామి కొడుకును పూజారిగా చేయమన్నారు. కానీ రాధాకృష్ణన్‌కు చదువంటే ప్రాణం. అందుకే ఉన్నత పాఠశాల చదువుకోసం తిరుపతిలోని మిషనరీ పాఠశాలలో చేరారు. ఇక అప్పటినుంచీ ఈయన చదువంతా ఉపకారవేతనాలతోనే సాగిపోయింది. భోజనం చేసేందుకు అరిటాకు కూడా కొనలేని పరిస్థితుల్లో ఆయన నేలను శుభ్రపరచుకొని భోజనం చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి.

మద్రాసు క్రిస్టియన్ కళాశాలలో తత్వశాస్త్రంలో ఎమ్మే పూర్తిచేసిన రాధాకృష్ణన్ ఇరవై ఏళ్ల వయసులోనే మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో బోధకుడిగా చేరారు. ఆయన పాఠం చెప్పే తీరు విద్యార్థుల్లో ఎంతో ఆసక్తి కలిగించేది. ఆయన రోజులో 12 గంటలపాటు పుస్తకాలు చదువుతూనే ఉండేవారు. ఎన్నో విలువైన వ్యాసాలు, పరిశోధన పత్రాలను రాసేవారు. రాధాకృష్ణన్ మైసూర్ విశ్వవిద్యాలయం, కోల్‌కతా విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్ పదవులు చేపట్టడమే కాదు, ఆంధ్రా యూనివర్సిటీ, బెనారస్ హిందూ విశ్వవిద్యాలయాల్లో ఉపకులపతి (వైస్‌ఛాన్సలర్) గా పనిచేశారు. రష్యాలో భారత రాయబారిగా కూడా పనిచేశారు.

ఆయన రాసిన 'ఇండియన్ ఫిలాసఫీ' పుస్తకం ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. ప్రత్యేక ఆహ్వానంపై ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో ప్రసంగించారు. 'యూనివర్సిటీ ఎడ్యుకేషన్ కమిషన్'లో సభ్యుడిగా ఉండి మన విద్యా వ్యవస్థ అభివృద్ధికి ఎన్నో విలువైన సలహాలు, సూచనలు ఇచ్చారు రాధాకృష్ణన్.

1952లో మన మొదటి ఉపరాష్ట్రపతిగా, 1962లో భారత రెండో రాష్ట్రపతిగా అత్యున్నత పదవులు చేపట్టారు. 1954లో భారతరత్న పురస్కారం దక్కింది. అయినా ఏనాడూ ఆడంబరాలకు పోలేదు.

రాష్ట్రపతిగా ఉన్నప్పుడు వచ్చే వేతనంలో కేవలం 25 శాతం తీసుకుని మిగతాది ప్రధాన మంత్రి సహాయ నిధికి తిరిగిచ్చేవారు.రాధాకృష్ణన్ ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నప్పుడు విద్యార్థులకు శ్రద్ధగా బోధించడమే కాదు, వారిపై ప్రేమాభిమానాలు చూపేవారు. ఆయన మైసూరు నుంచి కలకత్తాకు ప్రొఫెసర్‌గా వెళ్లేప్పుడు గుర్రపు బండిని పూలతో అలంకరించి తమ గురువును కూర్చోబెట్టి రైల్వేస్టేషన్ వరకు విద్యార్థులే లాక్కుంటూ వెళ్లారట.రాధాకృష్ణన్ రాష్ట్రపతిగా ఉన్నప్పుడు ఆయన శిష్యులు, అభిమానులు పుట్టినరోజును ఘనంగా చేస్తామని కోరగా, దానికి బదులు ఆ రోజును ఉపాధ్యాయ దినోత్సవంగా చేయాలని ఆయన కోరారట. ఆరోజు నుంచే ఆయన పుట్టినరోజును ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా మారింది.

# సింగ్ నగర్ లో దోచేస్తున్నారు...

విజయవాడ, సెప్టెంబర్ 4 విజయవాడలో సింగ్‌నగర్ మొదలుకొని చాలా ప్రాంతాల్లో ముంపుకు గురయ్యాయి. ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ముంపుతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ఆయా ప్రాంతాల్లో ప్రజలు తాగు నీరు కూడా లేకుండా ఇబ్బంది పడుతున్నారు. ఇదే అవకాశంగా పాల ధరలు పెంచేశారు.ప్రభుత్వం అందించే ఆహార పదార్థాలు కూడా ముందుగా ఉండే కాండ్రిక, పాయకపురం వంటి ప్రాంతాల వరకు వెళు_న్నాయి. శివారు ప్రాంతాలకు వెళ్లటం లేదు. విజయవాడలోని ఉడా కాలనీ, జర్నలిస్టు కాలనీ, రాజీవ్ నగర్, అజిత్ సింగ్ నగర్, ఆంధ్రప్రభ కాలనీ, నందమూరి నగర్, ఎల్‌బిఎస్ నగర్, వాంబే కాలనీ, మధురా నగర్, అయోధ్య నగర్, రామకృష్ణాపురం, కొత్త రాజరాజేశ్వరిపేట, పాత రాజరాజేశ్వరి పేట, పైపుల రోడ్డు, శాంతి నగర్, ప్రశాంతి నగర్, జక్కంపూడి, పాతపాడు, పి.నైనవరం, చిట్టినగర్, మిల్క్ ప్రాజెక్టు, వించిపేట, భవానీపురం, హెచ్‌బీ కాలనీ, విద్యాధరపురం ప్రాంతాల్లో ఉన్న వారికి సాయం కాస్తా జాప్యం జరుగుతోంది. అయితే ఇదే అదునుగా వ్యాపారులు రెచ్చిపోతున్నారు. ధరలను పెంచి అమ్ముతున్నారు.విజయవాడ సింగ్‌నగర్‌లో వ్యాపారులు, ప్రైవేటు బోట్ నిర్వాహకుల చేతివాటం. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఆహార పదార్థాలు సేకరించి అమ్మకం. శివారు కాలనీలకు ఆహారం తీసుకువెళ్లి సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులు. పంపిణీలో అధికారుల పర్యవేక్షణ లేదని ప్రజల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజులుగా ఆహారం పంపిణీ చేయలేదని బాధితుల ఆందోళన చేస్తున్నారు. బ్లాక్‌లో ఆహారం కొనుగోలు చేసేందుకు కూడా డబ్బులు లేవని బాధితులు లబోదిబోమంటున్నారు.వరదల్లో మునిగిపోయిన విజయవాడలో పాల కొరత తీవ్రమైంది. ఇదే అదునుగా వ్యాపారలు రేట్లు పెంచేశారు. అరలీటర్ పాల ప్యాకెట్ రూ.70-80 వరకు విక్రయిస్తున్నారు. దీంతో ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ఇళ్లలో చిన్న పిల్లలు ఉన్నారని, కనీసం ఒక్క పాలు ప్యాకెటైనా ఇవ్వాలని అధికారులను వేడుకుంటున్నారు. విజయ డెయిరీ, కృష్ణ మిల్క్ యూనియన్ సెంట్రల్ ఆఫీస్ మునిగిపోవడంతో లక్షల లీటర్ల పాలు, పెరుగు ప్యాకెట్లు చెడిపోయాయి.మరోవైపు ముంపు ప్రాంతాల నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు బోటు యజమానులు డబ్బులు వసూలు చేస్తున్నారు. దగ్గర ప్రాంతాలకు అయితే రూ.500 నుండి రూ.1,000 వరకు వసూలు చేస్తున్నారు. అదే దూర ప్రాంతాలకు అయితే రూ.1,500 నుండి రూ.4,000 వరకు వసూలు చేస్తున్నారని బాధితులు తెలుపుతున్నారు. కనీసం మానవత్వం కూడా లేకుండా ధర పెంచి మంచినీళ్లు, పాలు వంటి నిత్యావసర వస్తువులు అమ్ముతున్నారని, సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు డబ్బులు వసూలు చేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ముంపు ప్రాంతాల్లో మంత్రులు, రాజకీయ నాయకుల పర్యటనలతో సహాయ చర్యలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. వీవీఐపీల ప్రోటోకాల్ కోసం పోలీసుల ఉరుకులు, పరుగులు పెడుతున్నారు. రూట్ క్లియర్ చేయడం, ట్రాఫిక్ క్లియర్ చేయడం కోసం పోలీసులు శ్రమిస్తున్నారు. సమీక్షల్లో అధికారులు, క్షేత్ర స్థాయిలో ఉన్న సిబ్బందితో సమన్వయం కుదరటం లేదు. రాజకీయ పర్యటనలకు బ్రేక్ ఇస్తే సహాయ చర్యల్లో వేగం పుంజుకునే అవకాశముంది. పలు ప్రాంతాల్లో పోలీస్ సిబ్బందికి కమ్యూనికేషన్ రేడియోలు అందలేదు. బ్యాటరీలు అయిపోవడంతో క్షేత్ర స్థాయి సిబ్బందికి సమాచారం అందటం లేదు. విజయవాడ నగరంలోని పలు ప్రాంతాల్లో కేటాయించిన విధుల్లో అందుబాటులో సిబ్బంది లేరు.హైకోర్టు, ఏపీ సెక్రటేరియట్‌కు వెళ్ళే కరకట్ట దారిలో మంతెన ఆశ్రమం వద్ద కరకట్టకు పడ్డ గండిని యుద్ధ ప్రాతిపదికన రిపేర్ చేస్తున్నందున ఏపీ హైకోర్టుకు రెండు రోజులు సెలవు ప్రకటించాల్సిందిగా, హైకోర్టు రిజిస్ట్రార్‌కు గుంటూరు కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి లేఖ రాశారు. గతంలో ఎన్నడూ లేనంతగా కృష్ణా నదిలో వరదలు వచ్చాయని, 11.4 లక్షల క్యూసెక్కుల నీరు ప్రకాశం బ్యారేజీకి వచ్చిపడిందని అందులో పేర్కొన్నారు. హైకోర్టు, ఏపీ సెక్రటేరియట్‌కు వెళ్ళే కరకట్ట దారిలో మంతెన ఆశ్రమం వద్ద కరకట్టకు పడ్డ గండి పడిందని, దాన్ని మరమ్మత్తులు చేసేందుకు రెండు రోజులు హైకోర్టుకు సెలవు ప్రకటించాలని కోరారు. అందులో భాగంగా రెండు రోజులు సెలవు ప్రకటించారు.విజయవాడలోని వరద బాధితులకు దాదాపు 75 వేల అత్యావసర మందుల కిట్లు పంపిణీ చేయనున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు తెలిపారు. ఈ మేరకు అన్ని ఏర్పాటు పూర్తి చేసినట్లు తెలిపారు. విజయవాడ నగరంలో 14 మెడికల్ రిలీఫ్ క్యాంపులకు అత్యవసర కిట్లు చేరవేశామని అన్నారు. మరికొన్ని కిట్లను 10 మొబైల్ మెడికల్ వాహనాల ద్వారా అందిస్తామని చెప్పారు.

# విశాఖ కూటమిలో లుకలుకలు

విశాఖపట్టణం, సెప్టెంబర్ 4, టిడిపి కూటమి ప్రభుత్వంపై జనసేన ఎమ్మెల్యే ఆగ్రహంగా ఉన్నారా? నియోజకవర్గంలో తన మాట చెల్లుబాటు కాకపోవడం పై అసంతృప్తికి గురయ్యారా? టిడిపి నేతల పెత్తనాన్ని సహించలేకపోతున్నారా? అందుకే తిరుగుబాటుకు ప్రయత్నించారా? ఏపీ పొలిటికల్ సర్కిల్లో ఆసక్తికర చర్చ నడుస్తోంది. జనసేన ఎన్నికల్లో సంపూర్ణ విజయం సాధించింది. పొత్తులో భాగంగా 21 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసిన ఆ పార్టీ శత శాతం విజయం సాధించింది. రాష్ట్ర క్యాబినెట్లో మూడు మంత్రి పదవులను పొందింది. పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ కీలక నాలుగు శాఖలతో పాటు డిప్యూటీ సీఎం హోదాను దక్కించుకున్నారు. టిడిపి తో పొత్తు మరో 10 ఏళ్ల పాటు కొనసాగాలని ఆయన ఆకాంక్షిస్తున్నారు. అప్పుడే ఈ రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని భావిస్తున్నారు. జనసేన శ్రేణులకు సైతం ఈ విషయంలో స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. టిడిపి తో సమన్వయం చేసుకోవాలని సూచించారు. అయితే ఇప్పుడు ఏకంగా ఒక ఎమ్మెల్యే టిడిపి కూటమి ప్రభుత్వంపై తిరుగుబాటు చేశారని వార్తలు వినిపిస్తున్నాయి. ఇంతకీ ఆయన ఎవరంటే పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు. ఎన్నికలకు ముందు వైసీపీ నుంచి జనసేనలో చేరారు ఆయన. పొత్తులో భాగంగా పెందుర్తి సీటును జనసేనకు కేటాయించారు. ఇప్పటికే అక్కడ సీనియర్ నేత, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి టిడిపి ఇన్చార్జిగా ఉన్నారు. ఆయనకు కాదని పంచకర్ల రమేష్ బాబుకు జనసేన తరపున టికెట్ ఇచ్చారు. దీంతో బండారు సత్యనారాయణమూర్తి మాడుగులకు షిఫ్ట్ కావాల్సి వచ్చింది. అయితే ఎన్నికల్లో ఇద్దరూ గెలిచారు.అయితే పెందుర్తి నియోజకవర్గం లో తన మాట చెల్లుబాటు కావడం లేదన్నది పంచకర్ల రమేష్ బాబు బాధ. 2009లో ప్రజారాజ్యం పార్టీ తరఫున ఇదే పెందుర్తి నుంచి గెలిచారు పంచకర్ల. బండారు సత్యనారాయణమూర్తి పై గెలవడంతో వారిద్దరికీ అంతగా పడడం లేదు. అందుకే ఈ ఎన్నికల్లో తనకు టికెట్ కావాలని పట్టు పట్టారు బండారు సత్యనారాయణమూర్తి. చివరకు మాడుగుల వెళ్లినా..పెందుర్తి పై మాత్రం ఆశ చావలేదు. అందుకే పెందుర్తి పై పట్టు సాధిస్తున్నారని తెలుస్తోంది. దీంతో పంచకర్ల రమేష్ బాబు ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంటున్నారు.తాజాగా పోలీస్ అధికారుల బదిలీలు జరిగాయి. తన నియోజకవర్గంలోని పెందుర్తి, పరవాడ పోలీస్ స్టేషన్లలో అనుకూల అధికారుల కోసం లేఖలు ఇచ్చారు ఎమ్మెల్యే. కానీ ఎమ్మెల్యే సిఫారసులు పని చేయలేదు. ఎమ్మెల్యే ఒకరిని సూచిస్తే.. మరొకరిని అక్కడ నియమించారు. సాక్షాత్ హోం మంత్రి వంగలపూడి అనిత ఇదే జిల్లాకు చెందినవారు. తన లేఖలకు కనీస పరిగణలోకి తీసుకోకపోవడంతో పంచకర్ల రమేష్ బాబు తీవ్ర మనస్థాపానికి గురయ్యారు. అందుకే పోలీస్ శాఖ పై అసంతృప్తి వ్యక్తం చేస్తూ తనకున్న సెక్యూరిటీని సరెండర్ చేశారు. దీంతో ఇది హాట్ టాపిక్ గా మారింది. ఒక విధంగా చెప్పాలంటే టిడిపి కూటమి ప్రభుత్వంపై తిరుగుబాటు చేసినట్టేనని కామెంట్స్ వినిపిస్తున్నాయి. పెందుర్తిలో పట్టు బిగించాలన్నది బండారు సత్యనారాయణమూర్తి ప్రయత్నం. నియోజకవర్గాల పునర్విభజనకు ముందు పరవాడ నియోజకవర్గం ఉండేది. అక్కడ సుదీర్ఘకాలం బండారు సత్యనారాయణమూర్తి ప్రాతినిధ్యం వహిస్తూ వచ్చారు. అతనికి అక్కడ క్యాడర్ ఉంది. అందుకే తన రాజకీయ వారసుడిగా కుమారుడిని తెరపైకి తెచ్చారు. ఎన్నికల్లో కుమారుడికి టికెట్ ఇవ్వాలని చంద్రబాబుకు కోరారు.

## వరదబాధితుల కోసం విరాళాల సేకరణ

**ప్రజలను ఆదుకోవాలన్న సిటియూ నేతలు**

తిరుపతి,సెప్టెంబర్4( వరద ముప్పులో సర్వం కోల్పోయిన బాధితులను విరివిరిగా విరాళాలు ఇచ్చి ఆదుకోవాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు విజ్ఞప్తి చేశారు. తిరుపతిలో బుధవారం భవాని నగర్ సర్కిల్లో సిఐటియు ఆధ్వర్యంలో విరాళాలను సేకరించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగారావ్ మాట్లాడుతూ రాష్ట్రంలో భారీ వర్షాల వల్ల 17 మంది చనిపోయారని అన్నారు. కృష్ణానది బుడంమేరకు గత రెండు దశాబ్దాలలో ఎన్నడూ లేనంత వరదరావడం వల్ల లక్షలాదిమంది నిరాశ్రయులు అయ్యారని చెప్పారు. వందలాది ఇల్లు కూలిపోవడం కాకుండా వారి ఇంట్లో ఉన్న సామాన్లు నిత్యవసర సరుకులు పనికి రాకుండా పోయాయని తెలిపారు. వరద సహాయ కార్యక్రమంలో సిఐటియు భాగస్వామిగా ఉందని బాధితులకు వసతి ఆహారము నీరు అందించడానికి సిఐటియు కార్యకర్తలు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

ఈ సహాయం సరిపోదని మరింత కావాలంటే రాష్ట్ర ప్రజానీకం అంత తోడ్పాటు అందించాల్సిన అవసరం ఉందని చెప్పారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి రూపొంది మాట్లాడుతూ విజయవాడలో ఇంకా చాలా దిగ్బంధంలోనే ఉందని ఆహారము మంచినీరు కోసం ప్రజలు పాట్లు పడుతున్నారని, ప్రతి ఒక్కరు వరద బాధితులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ విరాళాల సేకరణ కార్యక్రమం తిరుపతి భవాని నగర్ లోని అన్ని ప్రాంతాల్లో విరాళాలు సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వి నాగరాజు, సిఐటియు జిల్లా నాయకులు జి బాలసుబ్రహ్మణ్యం, ఎస్ జై చంద్ర, టి సుబ్రహ్మణ్యం, వేణు 5వ జిల్లా కార్యదర్శి పి సాయిలక్ష్మి, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి హేమలత, హాకర్స్ యూనియన్ నాయకురాలు బుజ్జమ్మ పాల్గొన్నారు.

## భీమిలి తీరంలో విజయసాయి కుమార్తె అక్రమ నిర్మాణాలు

**కూల్చివేతలు చేపట్టిన జివిఎంసి అధికారులు**

విశాఖపట్టణం,సెప్టెంబర్4(: విశాఖ జిల్లా భీమిలి తీరంలో వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి సీఆర్‌జెడ్ నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన అక్రమ కట్టడాలను జీవీఎంసీ అధికారులు కూల్చివేసారు. భీమిలి జోన్ పట్టణ సహాయ ప్రణాళికాధికారి బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిబ్బంది ఉదయం 7 గంటల నుంచి బీచ్ ఒడ్డున హోటల్ కోసం వేసిన కాంక్రీట్ పిల్లర్స్, గోడలు, ఇతర నిర్మాణాలను తొలగిస్తున్నారు. కూల్చివేతల సందర్భంగా భీమిలి పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ తొలగింపు పక్రియను ఎవరూ అడ్డుకోకపోవడంతో సజావుగా జరుగుతున్నట్లు అధికారులు తెలిపారు. తొలగింపు పూర్తయ్యే సరికి సాయంత్రం అవుతుందని అంచనా వేస్తున్నారు. వైకాపా అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ ముఖ్య నాయకులు ఇక్కడి భూములను దౌర్జన్యంగా పెద్ద స్థాయిలో ఆక్రమించారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో విజయసాయిరెడ్డి కుమార్తె అక్రమాలపై జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్, మరికొందరు కూటమి నేతలు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం భీమిలి తీరంలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నట్లు నిర్ధరించింది. వీటిని వెంటనే తొలగించాలని ఉత్తర్వులు జారీ చేయడంతో ఆ మేరకు అధికారులు తొలగింపు పక్రియ చేపట్టారు. కూల్చివేతల పట్ల విశాఖ నగరవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వైకాపా నాయకులు పాల్పడిన మరిన్ని భూఅక్రమాలపై చర్యలు తీసుకోవాలని వారంతా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## టిడిపి కార్యాలయంపై దాడి కేసు

**వైసిపి నేతల ముందస్తు బెయిల్ తిరస్కరణ**

అమరావతి,సెప్టెంబర్4( టీడీపీ కేంద్ర కార్యాలయం, చంద్రబాబు నివాసంపై జరిగిన దాడి కేసుల్లో వైసీపీ నేతలకు బిగ్ షాక్ తగిలింది. ఈ కేసుల్లో ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించిన వైసీపీ నేతలకు నిరాశే ఎదురైంది. వైసీపీ నేతలకు ముందస్తు బెయిల్ పిటిషన్‌పై బుధవారం హైకోర్టులో విచారణకు రాగా.. బెయిల్ ఇచ్చేందుకు ధర్మాసనం తిరస్కరించింది. హైకోర్ట్ ఉత్తర్వులను రెండు వారాల పాటు సస్పెండ్ చేసి తమకు సుప్రీంకోర్టుకు వెళ్లేందుకు అవకాశం ఇవ్వాలని వైసీపీ నేతల తరపు న్యాయవాదులు కోరారు. ఇందుకు సంబంధించి సుప్రీంకోర్టు తీర్పు ఉందని వైసీపీ నేతల తరపు న్యాయవాదులు చెప్పారు. అయితే సుప్రీంకోర్టు తీర్పు అలా లేదని కోర్టుకు టీడీపీ న్యాయవాదులు తీర్పు కాపీ ఇచ్చారు. అన్నింటినీ పరిశీలించిన హైకోర్టు తుది ఉత్తర్వులు మధ్యాహ్నం ఇస్తామని పేర్కొంది. ఃకాగా.. 2021 అక్టోబరు 19న జరిగిన మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంపై వైసీపీ మూకలు దాడికి తెగబడ్డ విషయం తెలిసిందే.

అప్పట్లో వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండటంతో పోలీసులు తూతూమంత్రంగా కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారు. అయితే రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావడంతో ఈ కేసుపై దృష్టి సారించారు. ఈ ఘటనపై మంగళగిరి రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో ఇప్పటివరకు మొత్తం 106 మందికి టీడీపీ కార్యాలయంపై దాడిలో ప్రమేయం ఉన్నట్లు పోలీసుల విచారణలో గుర్తించారు. 21 మందిని అరెస్టు చేసి రిమాండుకు పంపించారు. మిగతా 85 మందికి మంగళగిరి రూరల్ పోలీసులు ఈ నెల 19 నుంచి నోటీసులు జారీ చేశారు. వీరిలో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డితోపాటు, విజయవాడకు చెందిన వైసీపీ నేత దేవినేని అవినాష్, అరవ సత్యం వంటి ముఖ్య నేతలతోపాటు ఓ న్యూస్ చానల్ రిపోర్టర్ కూడా ఉన్నాడు. అందుబాటులో లేని వారి ఇళ్లకు నోటీసులు అతికిస్తున్నారు.

## విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న సిలిండర్ల లారీ

**తప్పిన పెను ప్రమాదం**

వరంగల్,సెప్టెంబర్4(: గ్యాస్ సిలిండర్ల లోడుతో వెళ్తున్న లారీ బోల్తాపడింది. ఈ సంఘటన వరంగల్ జిల్లా ఖానాపురం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. హెచ్‌పీ గ్యాస్ సిలిండర్ల లోడుతో వెళ్తున్న లారీ అదుపుతప్పి ఖానాపురం మండల కేంద్రంలో విద్యుత్ స్తంభాలను ఢీకొని బోల్తా పడింది. అదృష్టవశాత్తు కరెంట్ తగలక పోవడంతో సిలిండర్లు పేలకుండా పోయాయి. లేకుంటే భారీ అగ్ని ప్రమాదం సంభవించేది. ఈ ప్రమాదంలో రెండు విద్యుత్తు స్తంభాలు విరిగిపోయాయి. లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలైనట్లు తెలిసింది. వరంగల్ నుంచి మహబూబాబాద్ జిల్లా బయ్యారం వైపు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది.

## వరద బాధితుల కు రూ 10,వేలు విరాళం.

ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ కు విరాళము అందజేస్తున్న సింగతల మహేశ్వరరెడ్డి.



నంద్యాల/రుద్రవరం-శ్రీ ప్రస్థానం:-విజయవాడ వరద బాధితుల సహాయార్థం 10 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియకు అందజేశారు. రుద్రవరం మండలం కొండమాయపల్లి గ్రామానికి చెందిన టిడిపి యువ నాయకుడు సింగతల మహేశ్వర రెడ్డివిజయవాడలోని వరద బాధితులు కోసం సీఎం సహాయ నిధికి ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆధ్వర్యంలో ముందుకొచ్చి 10 వేల రూపాయిలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద బాధితుల కోసం తమవంతు సహాయంగా ఎంతో కొంత విరాళం ఇవ్వడం జరిగిందన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎన్నికైన వెంకటరమణ.



నంద్యాల/రుద్రవరం-శ్రీ ప్రస్థానం:-ఉత్తమ ఉపాధ్యాయునిగా వెంకటరమణ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుబ్బారాయుడు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూజిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికైన రుద్రవరం జడ్పీహెచ్ స్కూల్ ఉపాధ్యాయుడు రుద్రవరం గ్రామం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో గణిత ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నారన్నారు. ఉపాధ్యాయుడు వెంకట రమణ 2024 సంవత్సరానికి గాను జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడుగా ఎంపిక కావడం జరిగిందన్నారు. ఈనెల 5 వ తేదీ కలెక్టరేట్ లో జరిగే అవార్డు ల కార్యక్రమం లో కలెక్టర్ చేతుల మీదుగా ఈ అవార్డు ను అందుకుంటున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయ బృందం ఉత్తమ ఉపాధ్యాయునికి అభినందనలు తెలిపారు.

### మొక్కలను నాటుదాం మానవ మనుగడకు బాటలు వేద్దాం.

తెలుగుదేశం పార్టీ నాయకులు. మొక్కలను నాటుతున్న టిడిపి నాయకులు, అధికారులు.

నంద్యాల/రుద్రవరం-శ్రీ ప్రస్థానం:-మొక్కలను నాటుదాం మానవ మనుగడకు బాటలు వేద్దాం అని తెలుగుదేశం పార్టీ నాయకులు అన్నారు. బుధవారం మండల కేంద్రం సమీపంలో వెలిసినటువంటి శ్రీ వాసాపురం వెంకటేశ్వర స్వామి నుంచి రుద్రవరం రెండు కిలోమీటర్ల మేరకు 800 కానుగ, కొండ సుంకేసుల మొక్కలను రోడ్డుకు ఇరువైపులా తెలుగుదేశం పార్టీ నాయకులు ఉపాధి హామీ ఈసీ సుబ్బన్న, టెక్నికల్ అసిస్టెంట్ నాగేంద్ర, ఫీల్డ్ అసిస్టెంట్ అశోక్ ఆధ్వర్యంలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ ఎల్వీ రంగనాయకులు మాట్లాడుతూ మొక్కలను నాటడం వలన మానవ జీవనానికి, జీవరాశుల మనుగడకు ఎంతో దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు సింగతల మధుసూదన్ రెడ్డి, అల్లడి శేఖర్ యాదవ్, నంద్యాల జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కొమ్ములపాటి రాజారావు, ఏరువా కృష్ణమూర్తి, టిడిపి మౌలాలి, గంతి సురేష్, కొండబోయిన వెంకటరమణ, తదితరులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# వర్షాలకు కూలిన మట్టి మిద్దెలు తప్పిన ప్రమాదం





దొర్నిపాడు,సెప్టెంబర్:04, శ్రీ ప్రస్థానం న్యూస్:- గత నాలుగు రోజులగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు దొర్నిపాడు మండలం క్రిష్టి పాడు గ్రామంలోని నిరుపేద కుటుంబాలకు చెందిన తిరుపెం గాళ్ల చిన్న తొ లిశెన్న, ముస్కిన్సాగారి ఫకృద్దిన్,లకు చెందిన మట్టి మిద్దెలు మంగ్లవారం రాత్రి కూలిపో యాయి.నాలుగు రోజులు పాటు వర్షం కురుస్తున్న కారణంగా వారి ఇళ్ళల్లో నిద్రిస్తుండగా మంగళ వారం అర్ధ రాత్రి ఒక్క సారిగా శబ్దం రావడం తో హుటాహుటిన నిద్ర లేచి బయటకు పరుగులు పెట్టారు. దీంతో పెను ప్రమాదం తప్పింది.బాధితులు ఇచ్చిన సమాచారం మేరకు స్పందించిన మండల తహసీల్దార్ ఎస్.సుభద్ర ఆదేశాల మేరకు బుదవారం గ్రామ వీ.ఆర్.ఓ.సాంబశివుడు, గ్రామానికి చేరుకొని గోడలు కూలి శిథిలావస్థలో ఉన్న మట్టి మిద్దెలను పరిశీలించారు.వర్షాలు అగే వరకూ కూలిన మట్టి మిద్దెల్లో ఉండవద్దని బాధితులకు తెలియజేశారు.తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరగా సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సత్వరమే న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.ఈ యన వెంట గ్రామ టిడిపి నాయకులు కట్టుబడి బాషా,సచివాలయం సర్వేయర్ గంగాధర్,వి. ఆర్.ఏ.చెన్నయ్య, పాల్గొన్నారు.

# గణేష్ మండ పాలకు అనుమతులు తప్పన సరి. ఎస్.ఐ. పి. వెంకటేష్.





దొర్ని పాడు, సెప్టెంబర్:04, శ్రీ ప్రస్థానం న్యూస్:- వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సెప్టెంబర్ 7 వ తేదీ శనివారం గణేష్ మండ పాలు ఏర్పాటుకు ఉత్సవాల నిర్వహణకు ప్రతి ఒక్కరూ మండల పోలీస్ స్టేషన్ కు వెళ్లి తప్పని సరిగా అనుమతి తీసుకోవాలని లేని యెడల అటువంటి వారి పై కఠిన చర్యలు తప్పవని మండల ఎస్.ఐ. పి. వెంకటేష్, తెలిపారు. బుదవారం స్థానిక పోలీస్ స్టేషన్ లో ఎస్.ఐ.వెంకటేష్,ఆద్వర్యంలో వినాయక మండ పాల ఏర్పాటు కు సిద్దం చేసిన కాలనీల వివరాలను అలాగే ఆయా గ్రామాల్లో ఎన్ని రోజుల్లో ఉత్సవాలు నిర్వహిస్తారు వంటి తదితర అంశాలపై వినాయక ఉత్సవ కమిటీ నిర్వాహకులతో చర్చించారు.. ఈ కార్యక్రమంలో భాగంగా ఎస్.ఐ. మాట్లాడుతూ నిమజ్జనం చేసే తేదీనీ.. కమిటీ సభ్యుల వివరాలను ముందుగానే తెలియజే యాలన్నారు.వినాయక చవితి సంధర్భంగా హిందువులందరూ అత్యంత భక్తి శ్రద్ధలతో వినాయక మండపాలు ఏర్పాటు చేసుకునే వినాయక మండపాల దగ్గర ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో కులమతాలకు అతీతంగా ఘనంగా జరిగేలా చూడాలని వినాయక ఉత్సవ కమిటీ సభ్యులకి తెలిపారు. ప్రబుత్వం నిబంధనలు అతిక్ర మించిన యెడల అటువంటి వారి పై కఠిన చర్యలు తీసుకుంటామనిఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏ ఎస్.ఐ.రంగయ్య,ఆయా గ్రామాల టిడిపి నాయకులు,ఉత్సవ కమిటీ నిర్వాహకులు పోలీస్ సిబ్బంది, వివిధ గ్రామాల మహిళ సంరక్షరాలు పాల్గొన్నారు.

# విజయవాడ వరద బాదితులకు జిల్లా నుండి రెండు మూడు రోజులలో నిత్యావసరవస్తువుల కిట్లు అందజేస్తాం.

### విలేకరుల సమావేశంజిల్లా టిడిపి అధ్యక్షులు తిక్కారెడ్డి వెల్లడి



కర్నూలు సెప్టెంబరు 04:గత నాలుగు రోజుల నుండి విజయవాడ లో వరదల కారణంగా జలమయమైన ప్రాంతాలలోని బాదితుల సహాయార్ధము కర్నూలు జిల్లా తెలుగుదేశంపార్టీ ఆధ్వర్యంలో రెండు మూడు రోజులలో వారికి కావలసిన నిత్యావసర వస్తువుల కిట్లను అందజేసేందుకు నిర్ణయం తీసుకున్నామనీ కర్నూలు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి తెలియజేశారు. ఈ రోజు వారు జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, అకెపోగు ప్రభాకర్, నాగేశ్వరరావుయాదవ్ మరియు ఇతర నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన పత్రికా, మీడియా ప్రతినిధుల సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు. జిల్లాలోని మంత్రులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, పార్లమెంట్ సభ్యులు, మాజీ యం.యల్.ఎ.లు, మాజీ యం.పి.లు, మాజీ యం.యల్.సి.లు పార్టీలో వివిధ హోదాలలో ఉన్న నాయకులు వరదసహాయక కార్యక్రమాలలో పాలుపంచుకునేలా జిల్లా పార్టీ ద్వారా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ప్రతి నియోజకవర్గం నుండి 1000 వరకు కిట్లను అందజేసేందుకు కృషిచేస్తామన్నారు.గత ఐదేళ్ల జగన్ ప్రభుత్వం నిర్వాహకం కారణంగా గతంలో ఎన్నడూ లేని విధంగా విజయవాడ నగరానికి వరద నీరు చేరి ఎన్నో కాలనీలు నీటమునిగాయి. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు వెంటనే స్పందించి ప్రభుత్వ పాలనా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి, తానే స్వయంగా రంగంలోకి దిగి కలెక్టర్ కార్యాలయం నుండి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, స్వయంగా బోటులో వెళ్లి బాదితులను సురక్షిత ప్రాంతాలకు తరలింపచేసి వేలాది మందిని ప్రాణనష్టం జరుగకుండా కాపాదారు. బాదితులకు నిత్యావసరాలైన పాలు, నీళ్ల బాటిల్స్, ఆహారం డ్రోన్లు, హెలిక్యాప్టర్ల ద్వారా పరుదలలో చిక్కుకున్న చివరి కాలనీల వాసుల వరకు చేరవేయించారు. బుడమేరు కెపాసిటీ కేపాసిటీకి మించి మూడింతల నీరు చేరడంతో గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రకాశం బ్యారేజి 11 లక్షల క్యూసెక్కుల నీరు చేరడం జరిగింది. ఇలాంటి పరిస్థితుల నుండి ప్రజలకు చేదోడుగా నిలువాల్చిన జగనరెడ్డి స్థాయిన మరిచి చంద్రబాబు గారిపై నిందలు వేశారనీ, బుడమేరు గేట్లు ఎత్తివేయించి నీటిని వదిలిన కారణంగానే ఈ రోజు విజయవాడ నీటమునిగిందనీ, అవగాహనలేని మాటలు మాట్లాడారు. ఒక పక్క చంద్రబాబు గారు ప్రాణహానీ జగరుకుండా కాపడుతుంటే, జగన్ శవ రాజకీయాలు చేసేందుకే అక్కడికి వచ్చారని కనీసం ఒక వాటర్ బాటిల్ కూడా ఇవ్వలేని జగన్కు చంద్రబాబు గారి గురించి మాట్లాడే అర్హత లేదని అన్నారు.గత 5 సంవత్సరాల కాలంలో వరదలు వచ్చిన సమయంలో ఏనాడైనా ప్రజల మద్యకు వచ్చావా జగన్ ! కేవలం హెలిక్యాప్టర్లో వచ్చి గాలిలో చక్కర్లు కొట్టి వెళ్లి, బూట్లకు బురద అంటకుండా కార్పెట్పై నడిచిన నీవా చంద్రబాబు గారిని తప్పుపట్టేది. నీకు మానవత్వం ఉంటే ఒక మాజీ సియం గా ప్రభుత్వానికి సూచనలు చేయాలి గానీ వరద బురదలో ఎవరో రాసిన తప్పుడు స్క్రిప్టు కూడా చదువలేని నీవు అన్నమయ్య ప్రాజెక్టు బాదితులను ఎందుకు ఆదుకోలేదని ప్రశ్నించారు.ఒక పక్క ముఖ్యమంత్రి గారు స్వయంగా ఫీల్డులోకి వెల్తుంటే కొంత మంది జగన్ అనుకూలంగా ఉన్న అధికారులు ఇంకా మొద్దు నిద్రవీడకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించినందువల్లనే, ప్రజలను పట్టించుకోకుండా ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా వ్యవహరించిన కారణంగానే ఇంకా పూర్తిస్థాయిలో సహయాక కార్యక్రమాలు చేపట్టలేకపోయిందని, కొంత మంది అధికారుల నిర్లక్ష్యం వెనుక జగన్ కుట్ర దాగి ఉంది. కొన్ని ప్రాంతాల నుండి బాదితుల కోసం దాతలు పంపుచున్నటువంటి ఆహారపదార్థాలుతీసుకొని వచ్చే వాహనాలను కూడా అడ్డుకునే నీచస్థాయికి వై.సి.పి. వారు దిగజారారు. ఈ పత్రికా విలేకరుల సమావేశంలో పార్టీనాయకులు యస్. ముంతాజ్, సత్రం రామక్రిష్ణుడు, యస్. నవీన్, సంజీవలక్ష్మి, పి.రవికుమార్, పి.హనుమంతరావు చౌదరి, షేక్షావలి,మొదలగు వారు పాల్గొన్నారు.

# వర్షాలకు దెబ్బతిన్న పంట నష్టం అంచనా వేసి వాస్తవ నివేదికను అందించండి

### పెండింగ్లో ఉన్న ఈ క్రాప్ బుకింగ్ త్వరితగతిన పూర్తి చేయండి

### జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు,సెప్టెంబర్ 04:- వర్షాలకు దెబ్బతిన్న పంట నష్టం అంచనా వేసి వాస్తవ నివేదికను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం తుగ్గలి మండలం పగిడిరాయి గ్రామంలో వర్షాల కారణంగా దెబ్బతిన్న ఆముదం, సజ్జ, కంది, టమోట పంట పొలాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు.అక్కడే ఉన్న రైతులతో మాట్లాడారు..ఎన్ని ఎకరాల్లో పంట సాగు చేశారు? ఎకరా సాగుకు ఎంత ఖర్చు పెట్టారు? దిగుబడి ఎంత వచ్చింది? మార్కెటింగ్ తదితర వివరాలను కలెక్టర్ రైతులను అడిగి తెలుసుకున్నారు. దెబ్బతిన్న పంటల నష్టాన్ని అంచనా వేసి నివేదికను ప్రభుత్వానికి పంపుతామని కలెక్టర్ రైతులకు వివరించారు..పెండింగ్లో ఉన్న ఈ క్రాప్ బుకింగ్ త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షపు నీరు నిల్వ ఉన్న దిగువ ప్రాంతాల్లో వెంటనే ఎన్ఆర్జిఎస్ కింద డీసిల్టేషన్ పనులు చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని డ్వామా ఎపిడి ని కలెక్టర్ ఆదేశించారు..పంటలకు యూరియా, ట్రిపుల్ 19 స్ప్రే చేయించే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ గారి వెంట అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, పత్తికొండ ఆర్డీఓ రామలక్ష్మి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, డిపిఓ నాగరాజు నాయుడు, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మోహన్, అగ్రికల్చర్ అధికారి పవన్, తదితరులు పాల్గొన్నారు.

## పరవాడలో భూలోకమాంబ అమ్మవారి ఉత్సవం




అనకాపల్లి జిల్లా పరవాడ మండలం శ్రీ ప్రస్థానం:-అనకాపల్లి జిల్లా పరవాడ మండలం పరవాడ గ్రామంలో గురువారం పరవాడ గ్రామ ప్రజల ఆరాధ్య దైవం శ్రీ భూలోకమాంబ అమ్మవారి పండుగ మహోత్సవం సంద ర్భంగా అమ్మవారికి తెల్లవారు జాము నుంచే ప్రత్యేక కుంకు మ పూజలు, దర్శనాలు ప్రారం భమవుతాయి. అలాగే మధ్యా హ్నం అమ్మ వారి ఆలయం వద్ద భారీ అన్నసమారాధన కు గ్రామ ప్రజలు మరియు ఇతర గ్రామ ప్రజలు అందరూ అమ్మవారి పండుగకి విచ్చేసి అమ్మవారి కృపకు పాత్రులు కాగలరు పరవాడ సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు కమిటీ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ గ్రామ పెద్దలు భక్తులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను సన్మానించిన టిడిపి నాయకులు

గొర్రెల కాపరుల సంఘం ప్రసిడెంట్ కొండారెడ్డి ఎన్నిక



ఎమ్మిగనూరు:-- గొర్రెల పెంపకందారుల సహకార సంఘం గ్రామ ప్రసిడెంట్ గా గొల్ల పెద్ద కొండరెడ్డీ వైస్ ప్రసిడెంట్ గా బోయ ఈరయ్య ఏకగ్రీవంగా పశువుల డాక్టర్ హేమంత్ ఆధ్వర్యంలో ఎన్నికయ్యారు ఎమ్మెల్యే బివి జయనాగేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ గొర్రెల కాపరి సహకార సంఘం ఎన్నికైన సందర్భంగా టీడిపి బిసి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ముగతి ఈరన్న గౌడ్, టిడిపి గ్రామ అధ్యక్షులు భార్గవ్ యాదవ్, అధ్యక్షతన ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డి నీ శాలువా దండతో శుభాకాంక్షలు తెలిపారు.నందవరం మండలం ముగతి గ్రామానికి చెందిన గొర్రెల సంఘం ప్రసిడెంట్ గొల్ల పెద్ద కొండరెడ్డి వైస్ ప్రసిడెంట్ బోయ ఈరయ్య, పాలకవర్గ సభ్యులు పెద్ద సోమన్న, ఈ ఈరన్న,ఈ. ఊరుకుంద గౌడ్, గాదిలింగప్ప, బజరి,ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాలరాజు, మాజీ వైస్ సర్పంచ్ తాయన్న, రాముడు, అర్జున్ యాదవ్, ధనుంజయ్, తులసిరామ్, తదితరులు పాల్గొన్నారు.

## బిజినవేముల సర్పంచ్ రవి యాదవ్ టిడిపిలో చేరిక.

నందికొట్కూరు నందికొట్కూరు నియోజకవర్గ పరిధిలోని బిజీనవేముల గ్రామ వైసిపి సర్పంచ్ రవి యాదవ్, బుధవారం అల్లూరు గ్రామం లోని మాండ్ర స్వగృహంలో నంద్యాల పార్లమెంట్ ఇన్చార్జ్ మాండ్ర శివానందరెడ్డి, ఎమ్మెల్యే గిత్త జయసూర్య, సమక్షంలో300 కుటుంబాలు టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు పోవడం జరుగుతుందని , కాబట్టి మా గ్రామ అభివృద్ధి కోసం వైసిపి నుంచి మాండ్ర శివానందరెడ్డి సమక్షంలో టిడిపిలో చేరడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, మహమ్మద్ రఫీ, ఉషన్ మియా, యాకోబు, బాషా, శివలింగం, శాలుబాషా, మద్దిలేటి, చిన్నన్న, సుధాకర్, బాలకృష్ణ,సలుద్దీన్,శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



EDITED,PRINTED,PUBLISHED AND OWNED BY PERUMALLA CHENNAKESHAVULU PRINTED AT UTTEJITHA PRINTERS, H.NO: 46/801, BUDHAWARAPETA, KURNOOL DIST. - 518001, ANDHRA PRADESH, INDIA. PUBLISHED AT H.NO: 43/217A, N R PETA, KURNOOL DIST., ANDHRA PRADESH, INDIA. EDITOR : PERUMALLA CHENNAKESHAVULU.RNI No : APTEL 2020/80757